



పొలం చదును చేసే పరికరం కొనుగోలు చేయలేక కుటుంబ సభ్యులతో పొలం చదును చేస్తున్న రైతు

కర్షకుల కన్నీరు ఆగేనా ?

- గత ప్రభుత్వంలో అష్టకష్టాలు
- పథకాల అమలుకు ఎన్నో నిబంధనలు
- ముప్పుతిప్పలు పెట్టిన సున్నా వడ్డీ
- ఐదేళ్లుగా అందని సూక్ష్మపోషకాలు
- ఏటేటా పెరుగుతున్న సాగు వ్యయం
- అప్పుల ఊబిలో అన్నదాతలు
- కోలుకోలేని స్థితిలో కౌలురైతులు
- కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

సంగం, జూన్ 28 : గత వైసీపీ పాలనలో పంటల సాగు భారమైంది. అన్నదాతలు అప్పుల ఊబిలో కూరుకుపోయారు. ఒకవైపు ప్రకృతి వైపరీత్యాలు, మరోవైపు ఏటా పెరుగుతున్న సాగు వ్యయంతో సతమతమయ్యారు. మరోపక్క తెగుళ్ల దెబ్బకు సక్రమంగా పంటలు పండక రైతులు ఎంతో నష్టపోయారు. ఇంకోవైపు పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధర లేక అల్లాడిపోయారు. వైసీపీ ప్రభుత్వంలో ఇక తమకు కన్నీళ్లతప్ప సంతోషం లేదని, రైతులంతా ఎన్డీఏ కూటమికి పట్టం కట్టారు. కొత్త ప్రభుత్వంలోనైనా తమ కష్టాలు తీరుతాయా, లేదా ? అని వారు ఆశగా ఎదురుచూస్తున్నారు. ఉమ్మడి నెల్లూరుజిల్లాలోని కాలువలు, చెరువులు, బోర్ల కింద మాగాణి, మెట్టతో కలిపి సుమారు 10 లక్షల ఆయకట్టు ఉంది. ఇందులో 8 లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తారు. జిల్లాలో సుమారు 7.5 లక్షల మంది రైతులు ఉన్నారు. వారంతా గత ప్రభుత్వ హయాంలో అన్యాయానికి గురయ్యారు. ఎలాగంటే ఈ కథనం చదవాల్సిందే.

● కొందరికే సున్నా వడ్డీ

బ్యాంకుల్లో రూ. లక్షలోపు రుణం తీసుకున్న రైతులు వడ్డీ చెల్లించాల్సిన అవసరం లేదని, ప్రభుత్వమే చెల్లిస్తుందని వైసీపీ ప్రకటించింది. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో సుమారు నాలుగు లక్షలమంది రైతులు బ్యాంకుల్లో రుణం తీసుకుంటే, వారిలో కేవలం నాలుగో వంతు మందికి మాత్రమే సున్నా వడ్డీ పథకాన్ని వర్తింపచేశారు. అత్యధికశాతం రైతులకు సున్నావడ్డీ పథకం అమలు కాకపోవడంతో బ్యాంకులు, సహకార సంఘాలు, వ్యవసాయ శాఖ కార్యాలయాల చుట్టూ తిరిగారు.

● సూక్ష్మ పోషకాలేవి..?

నిస్సారమైన భూములను సారవంతం చేసే సూక్ష్మ పోషకాలను రైతులకు పంపిణీ చేసే పథకాన్ని గత వైసీపీ ప్రభుత్వం అటకెక్కించింది. ఐదేళ్లుగా రైతులు సూక్ష్మ పోషకాలకు దూరమయ్యారు. తెగుళ్ల, క్రిమికీటకాలతో పంటలు సక్రమంగా చేతికి అందక రైతులు నష్టాల పాలయ్యారు.

● కాగితాల్లోనే భూసార పరీక్షలు

గత వైసీపీ ప్రభుత్వంలో భూసార పరీక్షలకు కూడా అధికారులు స్వస్తి పలికారు. దీంతో రైతులు తమ పొలాల్లో ఏయే ఎరువుల కొరత ఉందో తెలుసుకునే అవకాశం లేక ఇష్టారాజ్యంగా రసాయన ఎరువులు వినియోగించి, భూమి నిస్సారంగా మారేలా చేసుకున్నారు.

● పొలంబడి ఎక్కడ ?

పొలం బడి కార్యక్రమాన్ని వైసీపీ ప్రభుత్వం మాటలకే పరిమితం చేసింది. కొన్ని మండలాల్లో పొలంబడి కార్యక్రమాన్ని ఆర్బీకే సిబ్బందితో బలవంతంగా అమలు చేశారు. అది కూడా మొదట్లో మండలానికి ఒకటి, ఆ తరువాత సబ్ డివిజన్‌కు ఒకటి చొప్పున మొక్కుబడిగానే నిర్వహించారు. నిధులు కేటాయింపులు లేక ఆర్బీకే సిబ్బందితోపాటు మండల వ్యవసాయాధికారులు నానా కష్టాలు పడ్డారు.

● డ్రిప్ ఇరిగేషన్ కనుమరుగు

జిల్లాలో నీటి లభ్యత తక్కువగా ఉండే మెట్ట ప్రాంతాల్లో డ్రిప్ ఇరిగేషన్ పథకం కీలకం. అందుకు అయ్యే ఖర్చులో 90 శాతం రాయితీ ఇచ్చేవారు. అలాంటి బహృత్తర పథకాన్ని వైసీపీ ప్రభుత్వం పూర్తిగా కనుమరుగు చేసింది. జిల్లాలోని ఉదయగిరి, ఆత్మకూరు మెట్ట ప్రాంతాల్లో ఉద్యాన పంటలకు డ్రిప్ ఇరిగేషన్ ఎంతో ప్రయోజనం చేకూర్చేది. డ్రిప్ కంపెనీలకు సక్రమంగా బిల్లులు చెల్లించకపోవడంతో వారు రైతుల పొలాల్లో డ్రిప్ పరికరాలను ఏర్పాటు చేసేందుకు ముందుకు రాలేదు.

● విత్తన రాయితీలోనూ కోతే..

ప్రభుత్వం ఏటా ఖరీఫ్, రబీ సీజన్లలో వివిధ పంటలకు 40 నుంచి 50 శాతంతో రాయితీ విత్తనాలను అందించేది. ఈ కార్యక్రమాన్ని వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. దీన్ని వల్ల ఏపీ సీడ్స్ సంస్థకు విత్తనాలు అందించే వ్యాపారులు లబ్ధి పొందడం తప్పితే.. రైతులకు ఏ మాత్రం ప్రయోజనం కలగలేదు.

● ఆధునిక పరికరాలేవి ?

వైసీపీ ప్రభుత్వంతో రాయితీతో అందించే ఆధునిక పరికరాల జాడే లేదు. రైతు సంఘాల పేరుతో కేవలం ఆర్బీకేలో ఒక సంఘానికే.. అందులో ఆ పార్టీ కార్యకర్తలకే పరికరాలు ముట్టచెప్పారు. వాటిని వారి సొంతానికి వాడుకున్నారు. సన్నచిన్నకారు రైతులకు ఉపయోగపడలేదు.

● కౌలు రైతుల పరిస్థితి అంతే..

జిల్లాలో సుమారు లక్ష మంది కౌలు రైతులు ఉంటే వారిలో సగం మందికి కూడా సీసీఆర్ కార్డులు లేవు. సీసీ కార్డులు ఉన్నా బ్యాంకుల రుణాలు మాత్రం కొందరికే ఇచ్చారు. ఇకపోతే వైసీపీ పాలనలో భూముల హక్కులపై రైతుల్లో నమ్మకం సన్నగిల్లింది. దీంతో సాగుపత్రాలపై సంతకాలకు ఎవరూ ముందుకు రాలేదు. వైసీపీ ప్రభుత్వంలో ఇన్ని కష్టాలు అనుభవించిన రైతు కొత్త ప్రభుత్వంలో తమకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని కోటి ఆశలతో ఎదురు చూస్తున్నాడు. ఎన్డీఏ ప్రభుత్వమైనా కర్షకుల కన్నీళ్లు తుడిస్తుందని ఆశిద్దాం.

పథకాలు సక్రమంగా అమలు చేయాలి



గత వైసీపీ ప్రభుత్వం హయాంలో అన్నదాతలకు ఎంతో నష్టం జరిగింది. పథకాలన్నీ కాగితాల్లో తప్పితే.. ఆచరణలో ఏమాత్రం అమలు కాలేదు. ప్రకృతి వైపరీత్యాలతో రైతులు నష్టపోతే అరకొరగానే ఇన్‌పుట్ సబ్సిడీని అందించారు. ప్రస్తుత ఎన్డీఏ ప్రభుత్వమైనా రైతులను ఆదుకోవాలి.

- నారాయణరెడ్డి, ఏఎన్ కండ్రిక, సంగం మండలం

భగ్గుమంటున్న బియ్యం

- ధరలు పెంచి విక్రయిస్తున్న వ్యాపారులు
- పట్టించుకోని పర్యవేక్షణ కమిటీ
- అధికరేట్లతో అల్లాడుతున్న ప్రజలు

నెల్లూరు (హరనాథపురం), జూన్ 28: జిల్లాలో బియ్యం ధరలు మండి పోతున్నాయి. కేజీ రూ. 50 నుంచి రూ. 74 వరకు విక్రయిస్తున్నారు. దీంతో సామాన్యులు బెంబేలెత్తిపోతున్నారు. జిల్లాలో సన్నాలు, జిలకర్లు అనే రెండు పేర్లు చెప్పి వ్యాపారులు ప్రజలను అడ్డంగా దోచుకుంటున్నారు. అయితే ధరల పర్యవేక్షణ కమిటీ ఇవేమి పట్టించుకోకుండా మౌనవ్రతం దాల్చింది.

● తూకం తగ్గిన బస్తా

గతంలో బియ్యం బస్తా అంటే వందకిలోలు, 70 కిలోలుగా ఉండేది. దాని ధర రూ.వెయ్యిలోపే ఉండేది. కాలక్రమేణా బియ్యం బస్తా అంటే 25 కిలోలు, పది, ఐదు కిలోలకు తగ్గించారు. లూజ్ బియ్యాన్ని కిలో లెక్కన విక్రయిస్తున్నారు. రెండు నెలల కిందట 25 కిలోల బస్తా రూ.1,300గా ఉండేది. ప్రస్తుతం సన్నాలు అయితే రూ. 1500 నుంచి రూ.1700వరకు, జిలకర్లు రూ. 1,500లకు అమ్ముతున్నారు. పాత బియ్యం పేరు చెప్పి వాటి ధర పెంచి విక్రయిస్తున్నారు. ఇంటికి తెచ్చి వండితే అన్నం ముద్దగా, సంగటిలాగా తయారవుతోంది. పాత బియ్యం అని చెప్పి కొత్త బియ్యాన్ని అమ్ముతూ వ్యాపారులు ప్రజలను మోసం చేస్తున్నారు. నెల్లూరు నగరంలోని స్టోన్‌హౌస్‌పేట, చిన్నబజారు ప్రాంతాల్లో బియ్యం అమ్మకాలు ఎక్కువగా జరుగుతుంటాయి. స్టోన్‌హౌస్‌పేటలోని ఓ దుకాణంలో ఉన్న రేటు మరో దుకాణంలో ఉండటం లేదు. బియ్యం ప్యాకింగ్‌కు వాడే ప్లాస్టిక్ గోతాలమీద ఎవరో ఒక సినీ నటి బొమ్మ ముద్రించో.. లేక అందరికీ తెలిసిన వ్యక్తిపేరో వేసో అమ్ముతున్నారు. సినీ నటి బొమ్మ ఉన్న బస్తా ధర కాస్త ఎక్కువ, బొమ్మ ముద్రించని బస్తా ధర రూ. 100 తక్కువని అమ్ముతున్నారు. 25 కిలోల బియ్యం బస్తా ముగ్గురు ఉండే కుటుంబం సరిగా తింటే ఒక నెల వస్తుంది. ఈ క్రమంలో చాలిచాలనీ జీతాలు అందుకుంటున్న ఎందరో రూ.1,500 నుంచి రూ. 1700 ధర పెట్టి బియ్యం కొనలేక పోతున్నారు.

● పట్టించుకోని కమిటీ

జిల్లాలో ధరల పర్యవేక్షణ కమిటీ ఉంది. ఈ కమిటీ ఇటీవల జేసీ సేతుమాధవన్ ఆధ్వర్యంలో సమావేశమైంది. ఉల్లిపాయలు, టమోటాల ధరలు పెరగడంతో వాటి ధరలు పెరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఈ సమావేశంలో జేసీ ఆదేశించారు. దీంతో వాటి ధరలు కొంత వరకు తగ్గాయి.అయితే బియ్యం ధరల పెరుగదలపై కమిటీ దృష్టి పెట్టలేదని పలువురు ఆరోపిస్తున్నారు. జిల్లాలో ధాన్యం విరివిగా పండుతోంది. ఖరీఫ్‌లో రెండు లక్షల ఎకరాల్లో ధాన్యం పండింది. బయట మార్కెట్‌లో పుట్టి ధాన్యం ధర రూ. 19 నుంచి రూ. 23వేల వరకు ఉంది. రైతుల పండించిన ధాన్యానికి బయట మార్కెట్‌లో మంచిరేటే ఉంది. ధాన్యం దిగుబడులు జిల్లాలో ఎక్కువగా ఉన్నా, బయట మార్కెట్‌లో బియ్యం ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. పెరుగుతున్న ధరలకనుగుణంగా కొందరు వ్యాపారులు బియ్యాన్ని గోదాముల్లో దాచుకొని వారిష్టమైన ధరలకు అమ్ముకుంటున్నారు. ఇప్పటికైనా ధరల పర్యవేక్షణ కమిటీ చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.



దిల్ రుబా ఆఖరి కళాకారుడు
శ్రీనివాసరావు మృతి

వెంకటగిరి టౌన్, జూన్ 28 : వెంకటగిరికి చెందిన అరుదైన దిల్‌రుబా వాయిద్య కళాకారుడు శ్రీనివాసరావు కన్నుమూశారు. ఆయన వయసు 104 సంవత్సరాలు. రాయదుర్గంలోని తన మేనల్లుడు డాక్టర్ గోపాల్ వద్ద కొంతకాలం గా ఉంటున్న శ్రీనివాసరావు గురువారం రాత్రి ఆఖరిశ్వాస విడిచారు. హిందుస్థానీ వాయిద్యం అయిన దిల్‌రుబా మీద కర్ణాటక సంగీతాన్ని పలికించడం శ్రీనివాసరావు ప్రత్యేకత. ఉత్తర భారతదేశంలోనే అరుదైన ఈ సంగీత వాయిద్యాన్ని దక్షిణభారత దేశంలో వాయించే ఆఖరి కళాకారుడు ఈయన. వయొలిన్, జలతరంగిణి, హార్మోనియం, కీ-బోర్డు ల్లోనూ శ్రీనివాసరావు దిట్ట. 1933 నుంచి వెంకటగిరిలోని అమెచ్యూర్ ఆర్టిస్ట్ అసోసియేషన్, వెంకటగిరి ఆర్ట్స్ థియేటర్, కల్చరల్ ఆర్ట్ థియేటర్స్, నట సమాఖ్య, ఆజాద్ అమెచ్యూర్ ఆర్టిస్ట్స్ వంటి సంస్థల్లో ఆయన క్రియాశీలకంగా వ్యవహరించారు. 1940-50 మధ్య వెంకటగిరి క్లబ్ కార్యదర్శిగా పది సంవత్స రాలు సేవలందించారు. పంచాయతీ బోర్డు సభ్యుడి గానూ పనిచేశారు. ఎస్వీబీసీ మాజీ చైర్మన్ వీబీ సాయికృష్ణ యాచేంద్ర సంగీత గేయధారకు హార్మోనియం సహకారం అం దించారు.ఆచార్య ఆత్రేయతో మంచి సాన్నిహిత్యం ఉండేది. శ్రీనివాస రావు సంగీతమే ఊపిరిగా జీవించారు. పెళ్లి చేసుకోలేదు. కొన్నేళ్లుగా మేనల్లుడి వద్ద ఉంటూ గురువారం కన్నుమూశారు.

నూతన విభాగం.. నిరుపయోగం !

- కరోనా సమయంలో చిన్నారుల కోసం అధునాతన వార్డు
- జీజీహెచ్‌లో 50 పడకలతో ఏర్పాటు
- ఒక్కరోజు సేవలందిస్తే ఒట్టు
- అధికారుల తీరుపై పలువురి ఆగ్రహం

నెల్లూరు (వైద్యం) జూన్ 28 : కరోనా సమయంలో చిన్నారుల కోసం నెల్లూరు జీజీహెచ్‌లో అధు నాతన విభాగాన్ని ఏర్పాటు చేశారు. అయితే ఆ విభాగాన్ని నేటికి వాడుకోలేదంటే వైద్యాధికారుల తీరు ఎలాఉందో తెలుస్తుంది. కొంతమంది వైద్యులు దీని వినియోగంపై అధికారుల దృష్టికి తీసుకు వచ్చినా ఫలితం లేదు. ఈ పరిస్థితిలో మనకెందుకులే అని వైద్యులు, సిబ్బంది నోరు మెదపటం లేదు. ఇప్పటికే మూడేళ్ల కావస్తున్నా ఆ విభాగాన్ని మాత్రం నేటికి ఎవరికీ వినియోగించలేదు. ఈ నేపథ్యంలో అధికారుల తీరుపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



వినియోగంలోకి రాని 50 పడకల ఆధునిక విభాగం

● రూ. 20 లక్షల వృథా

2021లో జూలైలో కరోనాను దృష్టిలో పెట్టుకుని కొత్త ఐపీ బ్లాక్ మొదటి అంతస్థులో 50 పడకలతో అధునాతన చిన్న పిల్లల విభాగాన్ని ఏర్పాటు చేశారు. ఇక్కడ కొత్త ఏసీలతో పాటు కర్టెన్లు వంటి వాటిని సిద్ధం చేశారు. ప్రతి పడకలకు ఆక్సిజన్ సరఫరాకు రంగం సిద్ధం చేశారు. రెండు గదుల్లో ఈ విభాగాన్ని ఏర్పాటు చేశారు. ఇందుకోసం రూ. 20 లక్షల పైగా ఖర్చు చేశారు. చిన్నపిల్లలకు ఈ విభాగంలో మెరుగైన చికిత్సలు అందించేందుకు ఏర్పాట్లు చేశారు. అయితే మూడేళ్ల కావస్తున్నా నేటికీ ఈ ఆధునిక విభాగాన్ని వినియోగంలోకి తీసుకు రాలేదు. కొందరు సెక్యూరిటీ సిబ్బంది దీన్ని వినియోగించుకుంటున్నారు. గత వేసవిలో ఈ విభాగాన్ని బాలింతల కోసం వినియోగించాలని అధికారులు భావించినా, ఆ దిశగా అడుగులు పడలేదు. కొత్తగా వచ్చిన టీడీపీ ప్రభుత్వం అయినా వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

● ఐసీయూ రోగులకిస్తే మేలు

ప్రస్తుతం ఐసీయూ రోగులకైనా ఈ విభాగాన్ని వినియోగంలోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం ఆయా విభాగాల్లో రోగులు పడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. ఇక్కడ నాలుగో అంతస్థులో ఒక్కక్క దానిలో 36 పడకల ఐసీయూ ఉంది. సర్జరీ చేయించుకున్న రోగులను మాత్రమే ఐసీయూకీ తరలిస్తుంటారు. ఐసీయూలో ఉండే సాధారణ రోగులు ఇబ్బంది పడుతున్నారు. ఈ పరిస్థితిలో ప్రస్తుతం ఖాళీగా ఉన్న ఆధునిక విభాగాన్ని ఐసీయూ రోగులకు కేటాయించాలని పలువురు అధికారులకు ప్రతిపాదనలు పంపినా ఫలితం కనిపించలేదు. ఇదిలాఉంటే ఆధునిక విభాగంలోని ఏసీలలో కొన్నింటిని ఇతర విభాగాలకు తరలించారు.

వినియోగంలోకి తీసుకువస్తాం..

ఎంతో అధునాతనంగా రూపొందించిన 50 పడకల విభాగాన్ని త్వరలో వినియోగంలోకి తీసుకు వస్తాం. పూర్తిస్థాయి పరిశీలన జరిపి ఎవరికి అవసరం అవుతుందో వారికే కేటాయిస్తాం. అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటాం.

- డాక్టర్ సిద్ధానాయక్, జీజీహెచ్ సూపరింటెండెంట్

మూడేళ్లయినా తేలని భోక్తలు

- 'సర్వేపల్లి'లో గ్రావెల్ కొల్లగొట్టిందెవరు ?
- రూ.100 కోట్లు సంపద దోచుకున్నారనే ఆరోపణలు
- అక్రమాలు నిగ్గుతేల్చినా చర్యలు శూన్యం
- ఎంపీ మాగుంట పేరు వాడిందెవరో..?
- అటకెక్కిన పోలీసు కేసు
- జరిమానా చెల్లించి తప్పించుకునే ప్రయత్నాలు ?



అక్రమ తవ్వకాలతో సర్వేపల్లి రిజర్వాయర్‌లో ఏర్పడిన భారీ గుంతలు(ఫైల్)

నెల్లూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): సర్వేపల్లి రిజర్వాయర్‌లో ఎక్కడ చూసినా భారీగుంతలు.. అనుమతులు పొం దింది గోరంత... తవ్వకాలు జరిపింది మాత్రం కొండంత.. సుమా రు రూ.100 కోట్ల విలువ చేసే గ్రావెల్‌ను తవ్వేశారని ప్రతిపక్షాల ఆరోపణ. అధికారుల విచారణలో అక్రమ తవ్వకాలు బట్టబయలు... ఏకంగా ఓ ఎంపీకి తెలియకుండా ఆయన పేరుతో మట్టి తరలింపు.. చివరకు ఆయనపై పోలీసు కేసు కూడా నమోదు.. ఇవీ మూడేళ్ల క్రితం రాష్ట్రవ్యాప్తం గా సంచలనం సృష్టించిన అంశాలు. అధికార బలంతో ఆ తర్వాత అన్నీ సర్దుకున్నాయి. అసలు తప్పే జరగలేదన్న ట్లు ఎవరికి వారు మిన్నకుండిపోయారు. కానీ ప్రతిపక్ష టీడీపీ నేతలు మాత్రం ఈ అక్రమాలను వదల్లేదు. ఆధారాలతో సహా లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. విచారణకు స్వీకరించిన లోకాయుక్త మైన్స్, పోలీసు అధికారులకు నోటీసులు జారీ చేసింది. మైనింగ్, ఇరిగే షన్ శాఖల అధికారులు లోకాయుక్తకు నివేదికలు కూడా అందజేశారు. సర్వేపల్లి రిజర్వాయర్‌లో మట్టి తవ్వకాలు అక్రమంగా జరిగింది నిజమేనని తేల్చారు. అయినా పోలీసు విచారణ మాత్రం ముందుకు సాగలేదు. ఈలోపు ఈ కేసును మాఫీ చేసేందుకు రకరకాల ప్రయత్నాలు జరిగాయి. ప్రస్తుతం వైసీపీ ప్రభుత్వం మారడంతో ఇప్పటికైనా సర్వేపల్లి రిజర్వాయర్ గ్రావెల్ భోక్తలు ఎవరన్నది తేలుస్తారా..? అన్నది ఆసక్తిగా మారింది.

● నిగ్గు తేల్చిన అధికారులు

వెంకటాచలం మండలం సర్వేపల్లి రిజర్వాయర్ నుంచి మట్టి తవ్వకాలు జరుపుకునేందుకు 2021 మే, జూన్ నెలల్లో ముగ్గురు వ్యక్తులు అనుమతులు తీసుకున్నారు. తూపిలి ఉదయకుమార్‌రెడ్డి, ఎం శ్రీనివాసులురెడ్డి, బీ శ్రీధర్‌రెడ్డిలు 8 వేల క్యూబిక్ మీటర్లకు పలు దఫాలుగా అనుమతులు పొందారు. ఒక్క ఎం శ్రీనివాసులురెడ్డి తండ్రి రాఘవరెడ్డి పేరుతో నాలుగువేల క్యూబిక్ మీటర్ల మట్టి తవ్వకాలకు అనుమతులు తీసుకున్నారు. కానీ తీసుకున్న అనుమతులకు తవ్విన తవ్వకాలకు పొంతనే లేదు. ఇష్టానుసారం తవ్వేసి అధికార పార్టీ నేతలు రూ.కోట్లు గడించారని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆధారాలతో సహా బయటపెట్టారు. తొలుత రాజకీయ ఒత్తిళ్లతో స్పందించని జిల్లా అధికారులు, రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాలతో విచారణ చేపట్టారు. సర్వేపల్లి రిజర్వాయర్‌లో జరిగిన తవ్వకాలను పరిశీలించి, కొలతలు వేసి అనుమతులకు మించి తవ్వకాలు జరిగినట్లుగా గుర్తించారు. మొత్తం 8 వేల క్యూబిక్ మీటర్ల మట్టి తవ్వకాలకు అనుమతులు ఇవ్వగా, 18,629 క్యూబిక్ మీటర్లు తవ్వినట్లు తేల్చారు. అయితే అక్రమ తవ్వకాలు ఇంకా భారీ స్థాయిలోనే ఉన్నప్పటికీ అప్పటి ప్రజాప్రతినిధుల ఒత్తిడితో ఈ మేరకు మాత్రమే అనుమతులకు మించి తవ్వినట్లు చూపించారు. అనుమతులకు మించి తవ్వకాలు జరిపిన నేపథ్యంలో నిబంధనల ప్రకారం ఇరిగేషన్ జేఈ కే ప్రసాద్ వెంకటాచలం పోలీసుస్టేషన్‌లో అనుమతులు పొందిన ముగ్గురిపై ఫిర్యాదు చేశారు. దీంతో జూన్ 21న ఏ1గా తూపిలి ఉదయ్‌కుమార్‌రెడ్డి, ఏ2గా ఎం శ్రీనివాసులురెడ్డి, ఏ3గా బి శ్రీధర్‌రెడ్డిలను చేరుస్తూ 427ఐపీసీ, 21(4)ఎంఎండీఏఆర్‌ఏ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

● ఎంపీ పేరు దుర్వినియోగం

నెల్లూరు నగర పరిధిలో ఉన్న మాగుంట ఆగ్రో ఫార్మ్‌కు మట్టి అవసరమైనట్లు ఆ ఫార్మ్ యజమాని అయిన ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి పేరు మీద అక్రమార్కులు దరఖాస్తు చేశారు. ఈ దరఖాస్తు మాటున రూ.కోట్ల విలువైన గ్రావెల్‌ను లేఅవుట్లకు అమ్ముకున్నారు. పోలీసు కేసుతో ఎంపీ మాగుంట పేరు వెలుగులోకి వచ్చింది. దీనిపై అప్పట్లోనే మాగుంట ఎస్పీకు ఫిర్యాదు చేయడంతో స్వయంగా ఎస్పీ విచారణ చేపట్టారు. ఇప్పటి వరకూ ఎంపీ పేరుతో అనుమతులు పొందింది ఎవరన్నది తేల్చలేకపోయారు. ఇరిగేషన్ అధికారులను విచారించగా అప్పటి ఓ ప్రజాప్రతినిధి వద్ద ఆర్థిక వ్యవహారాలు చూసే ఓ వ్యక్తి మట్టి తవ్వకాలకు దరఖాస్తు చేసుకున్నట్లు పోలీసులకు స్టేట్‌మెంట్ ఇచ్చారు. దీని ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేసి ఉంటే అసలు దొంగల గుట్టు బయటకొచ్చి ఉండేది. కానీ నాడు ఓ ప్రజాప్రతినిధి ఒత్తిడితో పోలీసులు కేసును పక్కన పెట్టేశారు. అక్రమంగా మట్టి తవ్వకాలు జరిపిన దాని కన్నా ఓ ఎంపీ పేరును దుర్వినియోగం చేయడం పెద్ద నేరమని న్యాయ నిపుణులు చెబుతున్నారు. ఇదిలాఉంటే అనుమతులకు మించి తవ్వకాలకుగానూ నాడు ఇరిగేషన్ అధికారులు రూ.10 లక్షలు జరిమానా విధించారు. అయితే కేసు పెండింగ్‌లో ఉండగా ఇరిగేషన్ అధికారులు జరిమానా ఎలా కట్టించుకున్నారన్న ప్రశ్న తలెత్తుతోంది. ఈ విషయాన్ని పోలీసులకు చెప్పకుండా దాచిపెట్టారు. పోనీ ఆ తర్వాతైనా పోలీసులు విచారణ చేసి ఉంటే ఏ బ్యాంకు ఖాతా నుంచి మొదట చలానా కట్టారు..? తర్వాత ఏ ఖాతా నుంచి జరిమానా చెల్లించారన్న అన్నది తేలిపోతుంది. అప్పుడు వారిని అరెస్టు చేస్తే అసలు దొంగలు బయటకొచ్చే అవకాశముంది. కానీ ఇప్పటి వరకూ ఆ దిశగా విచారణ సాగలేదు.

సహస్రలింగేశ్వరుడి ఆలయ భూమికి రక్షణ కల్పించండి

● అధికారులకు కలెక్టర్ ఆదేశం ● ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నెల్లూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగరంలోని ఇరుగాళమ్మ ఆలయం సమీపంలో ఫోర్జరీ పట్టాలతో ఆక్రమణలకు గురవుతున్న ప్రభుత్వ భూమి రక్షణకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎం హరినారాయణన్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'సహస్ర లింగేశ్వరా నీ భూమిని నువ్వు కాపాడుకో' అనే కథనానికి కలెక్టర్ స్పందించారు. ఫోర్జరీ పట్టాలతో చేసిన రిజిస్ట్రేషన్లను రద్దు చేయాలని సూచించారు. సహస్ర లింగేశ్వరస్వామి ఆలయానికి చెందిన ఈ భూమిని గతంలో టిడ్కో ఇళ్ల కోసం సేకరించి కార్పొరేషన్‌కు అప్పగించారు. అయినా ఆ భూమిని నిషేధిత జాబితాలో చేర్చలేదు. దీన్ని అదునుగా తీసుకున్న కొంతమంది అక్రమార్కులు ఫోర్జరీ పట్టాలు సృష్టించి రిజిస్ట్రేషన్లు చేశారు. ఇప్పుడు ఈ భూమిని నిషేధిత జాబితాలోకి చేర్చడంతోపాటు వెబ్‌ల్యాండ్ రికార్డుల్లో పేర్లు మార్పనున్నట్లు జేసీ సేతమాధవన్ తెలిపారు.

ఎలా అయితే బాగుంటుంది?

- నూతన మద్యం పాలసీపై కసరత్తు వేగవంతం
- జిల్లా ఎక్సైజ్ అధికారుల నుంచి సమాచారం సేకరణ
- పదేళ్ల వివరాలు పంపిన అధికారులు

నెల్లూరు(క్రైం), జూన్ 28: రాష్ట్ర ప్రభుత్వం నూతన మద్యం పాలసీపై వేగవంతంగా కసరత్తు చేస్తోంది. జూలై 1వ తేదీకే నూతన మద్యం పాలసీని ప్రకటిస్తారని అందరూ భావిస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం అమలు చేసిన పాలసీతో మందుబాబులు ప్రత్యక్ష నరకం చూశారు. ఈ క్రమంలో నూతన విధానంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రభుత్వం దృష్టి సారించినట్లు తెలిసింది. కొత్త పాలసీ ఎలా అయితే ఆమోదయోగ్యంగా ఉంటుందనే దానిపై కసరత్తు సాగుతోంది. ఒకవేళ ఈ పాలసీని జూలై 1వ తేదీన ప్రకటించినా అమలు మాత్రం సెప్టెంబరు 1 నుంచి ఉండవచ్చని సమాచారం. మందు బాబులు మాత్రం పాత బ్రాండ్లు ఎప్పుడు వస్తాయో?, మద్యం ధరలు ఎప్పుడు తగ్గుతాయో అని ఎదురు చూస్తున్నారు.

ఎక్సైజ్ అధికారుల నుంచి వివరాల సేకరణ

రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారుల నుంచి అనేక వివరాలను కోరింది. 2014 నుంచి 2019 వరకు అప్పటి మద్యం పాలసీలో ఉన్న ప్రైవేటు మద్యం దుకాణాల సంఖ్య, బార్ల సంఖ్య, సంవత్సరాల వారీగా సేల్స్ వివరాలను సేకరించింది. అలాగే 2019 నుంచి ఈ ఏడాది వరకు అమలైన మద్యం పాలసీలో ప్రభుత్వ మద్యం దుకాణాలు, సిబ్బంది జీతాలు, దుకాణాల బాడుగలు, సంవత్సరాల వారీగా సేల్స్, ఆదాయం వివరాలు, బార్ల ద్వారా వచ్చిన రాబడి, సేల్స్ వివరాలను పంపాలని జిల్లా అధికారులను ఆదేశించింది. దీంతో అధికారులు పదేళ్ల వివరాలను ప్రభుత్వానికి అందజేశారు.

సెబ్ విలీనంపై చర్చ



గత ప్రభుత్వంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖను రెండుగా విభజించారు. ఎక్సైజ్ శాఖలో నుంచి కొంత మంది సిబ్బందిని వేరు చేసి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్)ను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ మద్యం దుకాణాలు, బార్లు, మద్యం డిపోలు, మద్యం సేల్స్ వరకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు చూసుకునే వారు. బెల్ట్ దుకాణాలు, ఇతర రాష్ట్రాల మద్యం, గంజాయి, అక్రమంగా ఇసుక తరలింపు, గుట్కాలు వంటివి పట్టుకోవడం, కేసులు నమోదు చేయడం సెబ్ అధికారులు చేసే వారు. అయితే సెబ్ అధికారుల పనితీరుపై గత ప్రభుత్వంలో అవినీతి ఆరోపణలు వెల్లువెత్తడంతో సెబ్‌ను ఎక్సైజ్‌లో విలీనం చేసేందుకు ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోందని తెలిసింది. మొత్తంగా సెబ్ విలీనం సహా నూతన మద్యం పాలసీని ప్రభుత్వం త్వరలో ప్రకటించే అవకాశం ఉంది.

లైంగిక దాడి కేసులో ఏడేళ్ల జైలు

నెల్లూరు (లీగల్), జూన్ 28 : ఓ బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడన్న కేసులో నేరం రుజువు కావడంతో రాపూరు వీరయ్య అలియాస్ శేషయ్య వీరయ్య అనే నిందితుడికి ఏడు సంవత్సరాల జైలు శిక్ష, 5 వేల రూపాయల జరిమానా విధిస్తూ నెల్లూరు జిల్లా పోక్సో కోర్టు స్పెషల్ జడ్జి సిరిపిరెడ్డి సుమ శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.... గూడూరు రూరల్ మండలం చవటపాళెం పంచాయతీకి చెందిన నిందితుడు రాపూరు వీరయ్య 2015 ఏప్రిల్ 6వ తారీఖున అదే గ్రామానికి చెందిన మూడేళ్ల చిన్నారికి స్వీట్ ఇస్తానని చెప్పి, అతని ఇంటికి తీసుకువెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గూడూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. నిందితుడిపై విచారణ కాలంలో నేరం రుజువు కావడంతో జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూ టర్ డీ శైలజారెడ్డి వాదించారు.

గోదాము తాళాలు పగులగొట్టి నగదు చోరీ

నెల్లూరు(క్రైం), జూన్ 28: గుర్తుతెలియని దుండగులు గోదాము తాళాలు పగులగొట్టి క్యాష్ కౌంటర్‌లోని రూ.లక్ష నగదును దోచుకెళ్లారు. పోలీసుల సమాచారం మేరకు.. నెల్లూరులోని హరనాథపురానికి చెందిన గురుమూర్తి స్వీట్‌షాపులు, బేకరీలకు ముడి సరుకు సరఫరా చేస్తుంటారు. హరనాథపురం రెండవ వీధిలో ఆయనకు గోదాము ఉంది. శుక్రవారం ఉదయం గుర్తుతెలియని దుండగులు గోదాము తాళాలు పగులగొట్టి లోపల, బయట ఉన్న సీసీ కెమెరాలను ధ్వంసం చేసి సమీపంలోని కాలువలో పడేశారు. అనంతరం క్యాష్ కౌంటర్‌లోని రూ.లక్ష నగదును, డీవీఆర్‌ను అపహరించుకుని వెళ్లారు. ఉదయం గోదాము తలుపులు తెరిచి ఉండటం, క్యాష్ కౌంటర్‌లో నగదు కనిపించక పోవడంతో బాధితుడు బాలాజీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులుఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అంకితభావంతో విధులు నిర్వహించాలి

- ఎస్పీ ఆరీఫ్ హఫీజ్



అర్జీలు స్వీకరిస్తున్న ఎస్పీ ఆరీఫ్ హఫీజ్

నెల్లూరు(క్రైం), జూన్ 28: పోలీసు సిబ్బంది అంకితభావంతో విధులు నిర్వహించాలని, అనధికారికంగా విధులకు గైర్హాజరు కావద్దని ఎస్పీ కే ఆరీఫ్ హఫీజ్ సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం పోలీస్ వెల్ఫేర్ డే నిర్వహించారు. ఎస్పీ స్వయంగా సిబ్బంది నుంచి అర్జీలు స్వీకరించి వారితో ముఖాముఖిగా మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. వాటిని పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలోని పోలీసు సిబ్బంది సంక్షేమమే ప్రథమ కర్తవ్యంగా భావించి పోలీస్ వెల్ఫేర్ డే నిర్వహిస్తున్నామని చెప్పారు. వృత్తిపరమైన, ఆరోగ్యపరమైన, మహిళా కానిస్టేబుల్స్ సమస్యల అర్జీలను సత్వరమే పరిశీలించి తగిన చర్యలు తీసుకునేలా డీపీవో పరిపాలనా విభాగానికి ఆదేశాలు జారీ చేశారు. అనంతరం సిబ్బంది కోరుకున్న చోటుకే ఖాళీల ఆధారంగా పారదర్శకతంగా స్థాన చలనం కల్పించారు.

లాడ్జీల్లో ఆకస్మిక తనిఖీలు



లాడ్జీల్లో తనిఖీ చేస్తున్న ఎస్ఐ రమ్యగీత

నెల్లూరు(క్రైం), జూన్ 28: నేర నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాలు అరికట్టడంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా గురువారం అర్ధరాత్రి పోలీసులు లాడ్జీలలో ఆకస్మిక తనిఖీలు చేపట్టా రు. లాడ్జీల్లోని ప్రతి గదిని క్షుణ్ణంగా తనిఖీ చేసి, బస చేసిన వ్యక్తుల వివరాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎస్పీ ఆరీఫ్ హఫీజ్ మాట్లాడుతూ ఇతర రాష్ట్రాలకు చెందిన ఎవరైనా అనుమానా స్పదంగా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమా చారం అందించాలని లాడ్జీల యాజమాన్యానికి సూచించారు. మట్కా, పేకాట, క్రికెట్ బెట్టింగ్ తదితర చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు తావు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. లాడ్జీ పరిసరాలు స్పష్టంగా కనిపించేలా తప్పనిసరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు.

కల్లుగీత కార్మికుడి మృతి

మనుబోలు, జూన్ 28: యాచవరం క్రాస్‌రోడ్డు వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కల్లుగీత కార్మికుడు తాళ్ళ శ్రీనివాసగౌడ్ (36) చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. మృతుడు చేజర్ల మండలం చిత్తలూరు గ్రామానికి చెందినవాడు. మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	132
లేయర్ లైవ్	120
స్కిన్ చికెన్	238
స్కిన్‌లెస్	266
లేయర్	204

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.6841
వెండి కిలో ధర	రూ. 90,600
వెండి ఒక గ్రాము	రూ. 92.60

రామాలయంలో చోరీ

నెల్లూరు రూరల్, జూన్ 28 : నెల్లూరు రూరల్ పరిధిలోని 17వ డివిజన్ వడ్డిపాళెం రామమందిరంలో చోరీ జరిగింది. మందిరంలోని హుండీని, అమ్మ వారి ఉత్సవ మూర్తికి అలంకరించిన 4 గ్రాముల బంగారు తాళిబొట్టు, 2 గ్రాముల బంగారు కాసులు అపహరణకు గురైనట్లు ఆలయ వర్గాలు శుక్రవారం వెల్లడించాయి. హుండీలో సుమారు రూ.50 వేల వరకు నగదు ఉండవచ్చని లెక్కకట్టారు. రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు దర్యాప్తు చేస్తున్నారు. కాగా... కందమూరు, ములుముడి గ్రామాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురైనట్లు పోలీసులకు ఫిర్యాదులు అందాయి.

జరిగేనా ?

టీచర్ పోస్టుల భర్తీ



- ఉపాధ్యాయుల సర్దుబాటు మాటేంటి..?
- జిల్లాలో వేధిస్తున్న అయ్యోర్ల కొరత
- భారంగా విద్యాబోధన

నెల్లూరు (విద్య), జూన్ 28 : పాఠశాల విద్యాశాఖలో ఉపాధ్యాయ, విద్యార్థుల నిష్పత్తిపై తీసుకున్న నిర్ణయంతో బోధనా సిబ్బందిపై పనిభారం పెరుగుతోందని విద్యారంగ నిపుణులు చెబుతున్నారు. నూతన జాతీయ విద్యావిధానం అమల్లో భాగంగా ఇప్పటి వరకు ప్రాథమిక పాఠశాలల్లోని 3, 4, 5 తరగతులను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేశారు. గడిచిన విద్యా సంవత్సరంలో పని సర్దుబాటు కింద ఉన్నత పాఠశాలల్లో పనిచేయించుకున్న సబ్జెక్ట్ టీచర్లను తిరిగి ఈ ఏడాది అదే పాఠశాలల్లో కొనసాగించాలని సూచిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. దీంతో ఉపాధ్యాయ సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ క్రమంలో జిల్లాలోని అత్యధిక పాఠశాలల్లో బోధనకు ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయి.

ప్రాథమిక పాఠశాలల విలీనం..

ప్రాథమిక పాఠశాలల్లోని 3, 4, 5 తరగతులను సమీపంలోని ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయాలనే ఎస్‌ఈసీ ప్రతిపాదనల మేరకు జిల్లాలో ఈ ప్రక్రియ పూర్తిచేశారు. తొలుత 250 మీటర్ల దూరం ఉన్న పాఠశాలలను విలీనం చేస్తూ నిర్ణయం తీసుకున్నా అనంతరం జిల్లాలోని ఉన్నత పాఠశాలలకు కిలో మీటరు దూరంలో ఉండే 197 ప్రాథమిక పాఠశాలలను విలీనం చేశారు. వీటిలో ఒక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఒక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, 184 ఎంపీపీ పాఠశాలలను 173 జడ్పీ ఉన్నత పాఠశాలల్లో, 12 మునిసిపాలిటీ ప్రాథమిక పాఠశాలలను 10 ఉన్నత పాఠశాలల్లో కలిపి మొత్తం 197 ప్రాథమిక పాఠశాలలను 184 ఉన్నత పాఠశాలల్లో విలీనం చేశారు. ఈ ప్రక్రియలో అన్ని వసతులున్న జడ్పీ ఉన్నత పాఠశాలలకు 49 ప్రైమరీ పాఠశాలలను విలీనం చేయగా, మిగిలిన ప్రాథమిక పాఠశాలలు ప్రస్తుతం ఉన్న చోటనే నిర్వహిస్తున్నారు. ప్రాథమిక తరగతులను దూరం చేయడం వలన పేద విద్యార్థులు అత్యధికశాతం మంది చదువులకు దూరమయ్యే పరిస్థితులు ఏర్పడ్డాయి. ప్రాథమిక తరగతులు ఉన్నత పాఠశాలల్లో విలీనం తర్వాత మొత్తం 8 తరగతులు అయ్యాయి. విద్యాశాఖ సూచనల మేరకు కనీసం 9 మంది ఉపాధ్యాయులు పనిచేయాలి. ఈ లెక్కన తరగతికి ఒక ఉపాధ్యాయుడు బోధనలో నిమగ్నం కావాలి. అయితే ఉపాధ్యాయులు ఎవరైనా సెలవు పెడితే ఏంచేయాలో తెలియని పరిస్థితులు నెలకొన్నాయి. మరోవైపు ఖాళీ పోస్టుల్లో అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్స్‌ను కాంట్రాక్ట్ పద్ధతిలో నియమించాలన్న ప్రతిపాదనలు కూడా అమలు కావడం లేదు. ఈ పరిస్థితుల్లో బోధనా సిబ్బందిని ఎలా సర్దుబాటు చేస్తారన్న అంశాలపై కూడా స్పష్టత లేదు. మరోవైపు ఉపాధ్యాయ, విద్యార్థుల నిష్పత్తి 1:30 గా పేర్కొన్నా కూడా సెక్షన్ల విషయంలో మాత్రం 59 మంది విద్యార్థులు దాటితేనే మరో సెక్షన్ ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈ లెక్కన 30 మందికి పైగా విద్యార్థులు ఉన్నా కూడా ఒకే ఉపాధ్యాయుడు బోధన చేయాల్సి ఉంటుం ది. వీటిని ఎలా భర్తీ చేస్తారో మాత్రం స్పష్టత లేదు.

సర్దుబాటు చేయకుంటే ఇబ్బందులే...

కొత్త ప్రభుత్వం ఇటీవల ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన చదువులే టీచర్లకు లక్ష్యంగా ఉండాలని, సమస్యలను పరిష్కరించుకుంటూ ముందుకెళ్లాలని సూచించింది. ఈ నేపథ్యంలో జులైలో తొలి యూనిట్ పరీక్షలు జరుగనున్న తరుణంలో పరీక్షలకు పిల్లలను సన్నద్ధం చేయడానికి సబ్జెక్ట్ టీచర్లు కావాల్సి ఉంది. దీనిపై ఉపాధ్యాయ సంఘం నేతలు, విద్యాశాఖ కార్యాలయంలో అధికారులతో పెద్ద ఎత్తున వాగ్వివాదానికి దిగారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ సబ్జెక్ట్ టీచర్ల కొరతను అధిగమించడంపై ఉన్నతాధికారులతో సంప్రదిస్తున్నామని, వారి ఆదేశాల మేరకు తగిన చర్యలు తీసుకుంటామని నేతలకు సర్ది చెప్పారు. అధికారులు దీనిపై దృష్టి సారించి గతంలో రిలీవ్ చేసి వెనుక్కి పంపిన టీచర్లను తిరిగి పని సర్దుబాటు పేరుతో పంపాలని కోరుతున్నారు.

విలీనంతో ఇప్పటికే ఇక్కట్లు

ప్రాథమిక పాఠశాలల విలీనంతో ఇప్పటికే సమస్యలు ఎదుర్కొంటుండగా విద్యాశాఖ అధికారుల ఉత్తర్వులు తమను మరింత ఇబ్బందులకు గురిచేస్తున్నాయని ఉపాధ్యాయ సంఘాలు అంటున్నాయి. పని సర్దుబాటు పేరుతో గడిచిన విద్యా సంవత్సరంలో తీసుకున్న టీచర్లను, స్కూల్ ముగింపు రోజున రిలీవ్ చేసి తిరిగి వారి మాతృ పాఠశాలల్లో రిపోర్టు చేసుకోమని వెనక్కి పంపించారు. ఈ నిర్ణయంతో ప్రస్తుతం అధికశాత ఉన్నత పాఠశాలల్లో బోధనకు సరిపడా టీచర్లు లేని పరిస్థితి నెలకొంది. ఉన్న టీచర్లపై పనిభారం పెరిగిందిజ తాము బోధించే సబ్జెక్ట్‌తో పాటు అదనంగా ఇంకో సబ్జెక్ట్ బోధించాల్సి వస్తోందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. జిల్లాలో అత్యధిక ఉన్నత పాఠశాలల్లో టీచర్ల సమస్య తీవ్రంగా ఉంది. ఇక్కడ శాంక్షన్ పోస్టులు చాలా తక్కువగా ఉండడం, ప్రవేశాల సంఖ్య ఎక్కువగా ఉండడంతో ఏటా టీచర్లను సర్దుబాటు కింద వర్క్‌లోడ్ లేని పాఠశాలల నుంచి సమకూర్చుకుని బోధనకు ఆటంకం కలగకుండా చర్యలు తీసుకుంటున్నారు. అయితే కొత్త ప్రభుత్వం ఏర్పడిన నేపథ్యంలో డిప్యూటేషన్‌లపై ఉన్నత స్థాయిలో నిర్ణయం తీసుకోవాలి. మరోవైపు కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే మెగా డీఎస్సీకి ఆమోదం తెలపడంతో రెగ్యులర్ టీచర్ల నియామకానికి మార్గం సుగమమైంది. అయితే ఈ నియామకాలు జరగడానికి మరికొంత సమయం పట్టనున్న నేపథ్యంలో ప్రభుత్వం స్పందించి ఈ టీచర్ల కొరతకు తాత్కాలిక పరిష్కారం చూపాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.

ఎస్‌ఈఐఎల్ ఎనర్జీకి ప్రతిష్ఠాత్మక అవార్డు



అవార్డు అందుకున్న ఎస్‌ఈఐఎల్ ఎస్జీఎం అల్తాఫ్

ముత్తుకూరు, జూన్ 28: ఎస్‌ఈఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ బిజినెస్ వరల్డ్ మీడియా గ్రూపు నుంచి ప్రతిష్ఠాత్మక గ్రీన్ బిల్డింగ్ ప్రాక్టీసెస్ అవార్డు కైవసం చేసుకుందని సంస్థ సీఈవో రాఘవ్ త్రివేది శుక్రవారం తెలిపారు. ముంబయిలో గురువారం జరిగిన ఫెసిలిటీ మేనేజ్‌మెంట్ కాన్ఫరెన్స్ అండ్ ఎక్సలెన్స్ అవార్డ్సు రెండవ ఎడిషన్ సందర్భంగా ఈ అవార్డును ప్రదానం చేశారన్నారు. కంపెనీ తరఫున అడ్మినిస్ట్రేషన్ సీనియర్ జనరల్ మేనేజర్ అల్తాఫ్ షేక్ ఈ అవార్డును అందుకున్నార న్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ అవార్డును గెలుచుకున్నం దుకు తమ బృందానికి అభినందనలు తెలిపారు. మండలంలోని సూపర్ క్రిటికల్ థర్మల్ పవర్ జనరేషన్ కాంప్లెక్స్‌లో అమలుచేసిన అత్యుత్తమ గ్రీన్ బిల్డింగ్ (హరిత భవన) కార్యక్రమాలకు ఎస్‌ఈఐఎల్ ఎనర్జీకి ఈ విశిష్ట గుర్తింపు లభించిందన్నారు. ముఖ్యంగా ఎస్‌ఈఐఎల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్, క్యాంటీన్ బిల్డింగ్ సహజ సూర్యకాంతిని అధికంగా వినియోగించుకునే విధంగా నిర్మాణం చేశామన్నారు. దీంతో అంతర్గత విద్యుత్ వినియోగం గణనీయంగా తగ్గిందని, అందుకే ఇవి గ్రీన్ బిల్డింగ్ సర్టిఫికేషన్ లకు అర్హత పొందాయన్నారు. అంతర్గత రవాణా కోసం ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం జరుగుతోందన్నారు. పచ్చదనానికి పెద్ద పీట వేస్తూ భారీ స్థాయిలో మొక్కల పెంపకం చేపట్టామన్నారు. పర్యావరణ పరిరక్షణ పట్ల కంపెనీ నిబద్ధతకు సాక్ష్యాలన్నారు.

వెంగమాంబ హుండీల లెక్కింపు



హుండీలను లెక్కిస్తున్న సిబ్బంది

దుత్తలూరు (ఉదయగిరి రూరల్), జూన్ 28: మండలంలోని నర్రవాడలో వెలసిన శ్రీవెంగమాంబ పేరంటాలమ్మ ఆలయంలో శుక్రవారం ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు మునలయ్య, వెంగయ్య, ఈవో వెట్టిగుంట ఉషశ్రీల ఆధ్వర్యంలో నెల్లూరు దేవదాయ ఇన్‌స్పెక్టర్ సుధీర్‌కుమార్ పర్యవేక్షణలో ఆలయ సిబ్బంది హుండీల లెక్కింపు చేపట్టారు. అందులో భాగంగా ఈ నెల 23వ తేదీ నుంచి 27వ తేదీ వరకు ఆలయంలో వివిధ చోట్ల ఏర్పాటు చేసిన హుండీలను లెక్కించారు. వీటి ద్వారా రూ.26,92,606, వివిధ ఇక్కట్లు, లడ్డూ ప్రసాదం విక్రయంతో రూ.16,73,970లు, అన్నదానం విరాళాలతో రూ.5,15,644, తాత్కాలిక అంగళ్ల అద్దెలతో రూ.8,00,000 చొప్పున మొత్తం రూ.56,82,220 ల ఆదాయం వచ్చిందన్నారు. గతేడాది కంటే ఈసారి అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో రూ.1,33,000లు ఆదాయం అధికంగా వచ్చిందన్నారు. బ్రహ్మోత్సవాలకు సహాయ సహకారాలు అందించడంతో పాటు విజయవంతానికి కృషి చేసిన ఎమ్మెల్యే కాకర్ల సురేష్, ఆలయ వ్యవస్థాప ధర్మకర్తలు, దేవదాయ, ప్రభుత్వ శాఖ అధికారులు, పోలీసులు, గ్రామస్థులకు ఈవో ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఎన్‌డీసీఎంఎస్ పర్సన్ ఇన్‌చార్జిగా

జేసీ బాధ్యతల స్వీకరణ



జేసీకి పుష్పగుచ్ఛం అందచేస్తున్న డీసీఎంఎస్ బీఎం వెంకటస్వామి

నెల్లూరు(హరనాథపురం), జూన్ 28 : నెల్లూరు జిల్లా కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ పర్సన్ ఇన్‌చార్జిగా జా యింట్ కలెక్టర్ సేతు మాధవన్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతల స్వీకరణకు సంబంధించిన దస్త్రాలను ఎన్‌డీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్ డీ వెంకటస్వా మి కలెక్టరేట్‌లోని జేసీ చాంబర్‌కు తీసుకొని వెళ్లగా అక్కడ పర్సన్ ఇన్‌చార్జిగా జేసీ సంతకం చేసి బాధ్యతలు స్వీకరించారు.

ఆరు సహకార సంఘాలకు పర్సన్ ఇన్‌చార్జులు

జిల్లాలో త్రిసభ్య కమిటీలుగా వ్యవహరిస్తూ, రాజీనామా చేయని ఆరు పీఏసీఎస్‌లకు పర్సన్ ఇన్‌చార్జులను నియమించాలని డీసీవోను ఆదేశిస్తూ సహకారశాఖ కమిషనర్ ఏ బాబు ఉత్తర్వులు పంపారు. ప్రభుత్వం మారినా ఇప్పటి వరకు జిల్లాలోని ఆరు సంఘాలకు వైసీపీ ప్రభుత్వం నియమించిన త్రిసభ్య కమిటీలు రాజీనామా చేయలేదు. ఆ కమిటీలను తొలగించి సహకార శాఖ అధికారులతో పర్సన్ ఇన్‌చార్జిని నియమించాలని ఆదేశాలు అందాయి. దీంతో జిల్లా సహకారశాఖాధికారి గురప్ప ఆయా సంఘాల త్రిసభ్య కమిటీలను తొలగించి, సహకార శాఖ అధికారులతో పర్సన్ ఇన్‌చార్జిని నియమించాలని డీఎల్‌సీవోలను ఆదేశించారు. ఈ సందర్భంగా గురప్ప ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ జిల్లాలోని రాపూరు, చేజర్ల, ఎస్ఎస్‌వీఆర్ పీఏసీఎస్, దగదర్తి, ముదివర్తి, ఓగూరు సంఘాలకు చెందిన త్రిసభ్య కమిటీలు రాజీనామా చేయలేదన్నారు. తాజా ఉత్తర్వులు సహకారశాఖ కమిషనర్ నుంచి అందటంతో వారిని తొలగించి, సహకారశాఖ అధికారులను నియమించాలని డీఎల్‌సీవోలను ఆదేశించామని తెలిపారు.

వైద్య విద్యార్థిని ఐశ్వర్య చంద్రికకు

ప్రతిష్టాత్మక అవార్డు



డాక్టర్ ఐశ్వర్య చంద్రిక

ఆత్మకూరు, జూన్ 28: అప్పారావుపాళెం వైద్య విద్యార్థిని ఐశ్వర్య చంద్రిక అమెరికాలోని ప్రతిష్టాత్మక డాక్టర్ ఇర్విన్ గోల్డ్ ఫర్డ్ మెమోరియల్ అవార్డు దక్కించుకున్నారు. సెయింట్ మైఖెల్ మెడికల్ సెంటర్‌లో జరిగిన ఇంటర్నల్ రెసిడెన్సీ ప్రోగామ్‌లో విశేషమైన ప్రతిభ కనబర్చినందున ఈ అవార్డును బహుకరించారు. ఆమె హైదరాబాద్‌లోని బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి అంకాలజీ సర్జన్ డాక్టర్ సీకె.నాయుడు కుమార్తె. తల్లి డాక్టర్ ఝాన్సీ. డాక్టర్ ఐశ్వర్య చంద్రిక అమెరికాలో వైద్య విద్యలో ఎండీ చదివారు. ప్రతిష్టాత్మ కమైన అవార్డును కైవసం చేసుకున్నందున అప్పారావు పాళెం, కొత్తపాళెం ప్రజలు అభినందనలు తెలిపారు.

చిలక వాహనంపై

విహరించిన రామలింగేశ్వరుడు

విడవలూరు, జూన్ 28: రామతీర్థంలోని రామలింగేశ్వరుని బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారు చిలక వాహనంపై విహరించి భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత ఆలయ ప్రధానార్చకులు పేరేపి శ్రీకాంత్‌శర్మ స్వామివారికి గణపతి, రుద్రాభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. అనంతరం పూలంగిసేవ నిర్వహించారు. తదుపరి స్వామి, అమ్మవారి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన చిలక వాహనంపై గ్రామ పురవీదుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో రామకృష్ణ, గుమస్తా వెంకటేశ్వర్లు, గ్రామపెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

సోమశిలలో 10.110 టీఎంసీల నీరు నిల్వ

అనంతసాగరం, జూన్ 28: సోమశిల పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా శుక్రవారానికి డ్యాంలో 10.110 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఎగువ నుంచి 396 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా దిగువ డెల్టాకు 200, ఉత్తర, దక్షిణ కాలువలకు 10 క్యూసెక్కుల నీరు సరఫరా చేస్తున్నారు.

నేడు జడ్పీ స్థాయీ సంఘ సమావేశం

నెల్లూరు (జడ్పీ), జూన్ 28 : జిల్లా పరిషత్ స్థాయీ (స్టాండింగ్) సంఘ సమావేశం శనివారం ఉదయం 10.30 గంటలకు జడ్పీ ఛైర్మన్ చాంబర్‌లో జరుగుతుందని జడ్పీ సీఈవో కన్నమనాయుడు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రణాళిక, ఆర్థిక, పనులు, గ్రామీణాభివృద్ధి, స్త్రీ,శిశు సంక్షేమశాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ, వైద్యఆరోగ్యశాఖలపై సమావేశంలో చర్చిస్తారని తెలిపారు.

ఈవీఎంలను భద్రంగా ఉంచండి

- కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు (వెంకటేశ్వరపురం), జూన్ 28 : సార్వత్రిక ఎన్నికలు పూర్తి అయిన నేపథ్యంలో వీవీ ప్యాట్ మిషన్లలో మిగిలి ఉన్న పేపర్ రోల్స్‌ను తొలగించి ఈవీఎంలను జాగ్రత్తగా భద్రపరచాలని కలెక్టర్ హరినారాయణన్ అధికారులను ఆదేశించారు. నెల్లూరు ఆర్డీవో కార్యలయ ప్రాంగణంలోని ఈవీఎం గోదాములను పలు రాజకీయపార్టీల నాయకులతో కలసి కలెక్టర్ శుక్రవారం పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ పద్మాదేవి, ఆర్డీవో మలోల తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో మెరుగైన వసతులు కల్పించండి

- జడ్పీ సీఈవో కన్నమ నాయుడు

నెల్లూరు (జడ్పీ), జూన్ 28 : గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన పాలనతో పాటు సౌకర్యాల కల్పన మెరుగ్గా ఉండాలని జడ్పీ సీఈవో కన్నమ నాయుడు అధికారులను ఆదేశించారు. ఎంపీడీవోలు, ఏవోలతో ఆయన జడ్పీ కార్యాలయంలో శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహిం చారు. ప్రతి గ్రామంలో మెరుగైన సౌకర్యాలు కల్పించేలా అధికారులంతా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. తాగునీరు, పారిశుధ్యం తదితరాలకు అధిక ప్రాధాన్యం ఉండాలన్నారు. జిల్లా పరిషత్ పాలనకు సంబంధించిన వివరాలు నిర్దిష్ట సమయంలో ఉన్న తాధికారులకు అందజేయాలని, ప్రభుత్వ పథకాలు, కార్యక్ర మాలు ప్రజలకు అందేలా కృషి చేయాలని ఆదేశించారు. ఈ కార్య క్రమంలో జడ్పీ డిప్యూటీ సీఈవో చిరంజీవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి

- తాగునీటి పథకాల పరిశుభ్రత
- కుళాయి నీటికి నమూనా పరీక్షలు

మర్రిపాడు, జూన్ 28: వాతావరణంలో వస్తున్న మార్పులతో గ్రామాల్లో డయేరియా కేసుల సంఖ్య పెరుగుతున్న క్రమంలో శుద్ధజలం సరఫరాపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సాధించింది. ఈ మేరకు మండలంలోని అన్ని గ్రామాల్లో ఎంపీడీవో మనోహర్‌రాజు రక్షిత మంచినీటి పథకాలను శుభ్రం చేయటం, ట్యాంకులు క్లోరినేషన్ చేయించి ప్రజలకు అవగాహనతో చైతన్య పరుస్తూ.. కార్యాచరణ చేపట్టారు. రక్షిత మంచినీటి పథకాల పర్యవేక్షణలో గ్రామీణ నీటి సరఫరా విభాగ అధికారులతో పాటు పంచాయతీ కార్యదర్శులు, ఆశావర్కర్ల మధ్య సమన్వయలోపంతో ఇప్పటివరకు ఉత్పన్నమవుతున్న సమస్యలపై పరిష్కారం దిశగా అధికారులు గతంలో అడుగులు వేయలేదు. ప్రత్యేకశ్రద్ధ పెట్టాల్సిన పంచాయతీ సర్పంచులు నిధుల కొరతతో ఈ కార్యక్రమాన్ని అటకెక్కించారు. నిబంధనల ప్రకారం ప్రతి ఓవర్‌హెడ్ ట్యాంక్‌ను 15రోజులకోసారి శుభ్రం చేసి తేదీతో సహా అక్కడ నమోదు చేయాలి. కానీ ఇలా ఎక్కడా జరగటంలేదు. ఇటీవల ప్రతి రక్షితనీటి పథకానికి వారం రోజుల నుండి యుద్ధప్రాతిపదికన గ్రామాల్లో మంచినీటి శుద్ధి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. సంబంధిత టెస్టుల కిట్లను ప్రతి సచివాలయానికి అందజేశారు.


సీతారామపురం: కుళాయి నీటి నమూనాను సేకరిస్తున్న అధికారులు

- అన్ని గ్రామాల్లో పనులు

- మనోహర్‌రాజ్, మర్రిపాడు ఎంపీడీవో

మండలంలోని గ్రామాల్లో రక్షిత నీటి పథకాలను పూర్తిస్థాయిలో శుభ్రం చేసేలా చర్యలు తీసుకున్నాం. ఈ పనులను కార్యదర్శులు పర్యవేక్షిస్తున్నారు. ప్రజలకు ఈ విషయంపై అవగాహన కల్పిస్తున్నాం. అన్నిట్యాంక్‌లలోని నీటిని టెస్టులు చేయి స్తున్నాం.


మంచినీటి ప్లాంట్లలోని నీటి శాంపిల్ సేకరిస్తున్న పంచాయతీ సిబ్బంది

- గ్రామాల్లో తాగునీటి పరీక్షలు

సీతారామపురం: డయేరియా నివారణ చర్యల్లో భాగంగా మండలంలోని అన్ని పంచాయతీల్లో వైద్యఆరోగ్య, పంచాయతీ సిబ్బంది శుక్రవారం తాగునీటి నమూనాలను సేకరించి పరీక్షలు నిర్వహించారు. ఈ క్రమంలో సీతారామ పురంలోని వీధుల్లో ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్ ఆధ్వర్యంలో కుళాయిల వద్ద నీటి నమూనాలు సేకరించి గ్రామ సచివాలయంలో పరీక్షలు చేశారు. తాగునీటి క్లోరినేషన్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ సుమతి, ఏఎన్ఎం సుబ్బమ్మ, వైద్య సిబ్బంది, గ్రీన్ అంబాసిడర్ నరసింహులు పాల్గొన్నారు.



ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష


ప్రవేశ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

సంగం, జూన్ 28: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాలలో 6,7,9 తరగతుల్లో మిగిలిన సీట్లకు శుక్రవారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. 6లో పది సీట్లు, 7లో ఆరు సీట్లు, 9లో మూడు సీట్లు ఖాళీగా ఉన్నాయి. 128మంది దరఖాస్తు చేసుకోగా 111మంది పరీక్ష రాయగా, 17మంది గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్ సుమతి తెలిపారు.

ఉదయగిరి డిపోకు రూ.6.52 లక్షల ఆదాయం

ఉదయగిరి, జూన్ 28: దుత్తలూరు మండలం నర్రవాడ శ్రీవెంగమాంబ బ్రహ్మోత్సవాల సందర్భంగా ఉదయగిరి ఆర్టీసీ డిపోకు రూ.6.52 లక్షల ఆదాయం వచ్చినట్లు డిపో మేనేజర్ శ్రీనివాసులు శుక్రవారం తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా 26, 27వ తేదీల్లో 24 ప్రత్యేక బస్సులు నడిపామన్నారు. ప్రత్యేకసర్వీసులు నడిపినందుకు సహకరించిన సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

దీక్ష యాప్‌పై అవగాహన


మాట్లాడుతున్న ఎంఈవో మస్తాన్‌వలి

సీతారామపురం, జూన్ 28: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఎంఈవో మస్తాన్‌వలి దీక్షాయాప్‌పై ప్రధానోపాధ్యాయులకు అవగాహన కల్పించారు. 1వతరగతి నుండి 8వ తరగతి వరకు చదివే విద్యార్థుల వివరాలను దీక్షా యాప్‌లో పొందుపరిచేలా ప్రధానోపాధ్యాయులు చూడాలన్నారు. జూలై 1 నుంచి 25 వరకు ర్యాలీ నిర్వహించాలన్నారు. గ్రామస్థులతో పాఠశాల సందర్శన, కళాజాతాలు, ప్రభుత్వ పాఠశాలలో లభించే సౌకర్యాల ప్రదర్శన, ప్రచార కార్యక్రమాలతో ఎక్కువ మంది విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేలా చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటి వద్దకే పింఛన్లు

ఉదయగిరి, జూన్ 28: జూలై 1వ తేదీ నుంచి ఇంటి వద్దే పింఛన్లు పంపిణీ చేసేందుకు సర్వం సిద్ధం చేసినట్లు శుక్రవారం ఎంపీడీవో ఈశ్వరమ్మ తెలిపారు. మండలంలోని 17పంచాయతీల్లో 4,963 పింఛన్‌దారులు ఉండగా వారి కోసం రూ.3.36కోట్లు సచివాలయాల సిబ్బంది చేతికి అందజేస్తామన్నారు. పింఛన్ అందజేసేందుకు వారివెంట తహసీల్దారు, ఎంపీడీవో కార్యాలయాల సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది ఉంటారన్నారు.

వినుకొండ నుంచి తిరుమలకు..

- టీడీపీ శ్రేణుల పాదయాత్ర


సేదతీరుతున్న టీడీపీ శ్రేణులు

అనంతసాగరం, జూన్ 28: పల్నాడు జిల్లా వినుకొండ మండలం కొత్తపాలెం ప్రాంతానికి చెందిన 12మంది టీడీపీ శ్రేణులు రెండు గ్రూపులుగా కలినడకన తిరుమలకు బయలుదేరారు. అందులో భాగంగా శుక్రవారం వారు అనంతసాగరంకు చేరుకున్నారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. సైకోపోయి.. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే తిరుమలకు కాలినడక వస్తామని మొక్కుకున్నట్లు చెప్పారు. అందులో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. పెంచలకోన, రాపూరు, వెంకటగిరి మీదుగా తిరుపతికి మరో 6రోజుల్లో చేరుకుంటామ న్నారు. వెంకటేశ్వర స్వామిని దర్శనం చేసుకొని ముఖ్య మంత్రి చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రం సుభి క్షంగా వుండేలా మొక్కులు తీర్చుకుంటామన్నారు. టీడీపీ జెండాలు చేత పట్టి కాలినడకన సూదుర ప్రాంతం నుంచి పాదయాత్ర చేస్తున్న వీరిలో నలుగురు మహిళలు ఉన్నారు.

కొరవడిన పారిశుధ్యం

ఉదయగిరి, జూన్ 28: జీ.చెరువుపల్లి పంచాయతీలోని సంజీవరాజుపల్లిలో మురుగునీరు నిల్వలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వాతావరణంలో ఏర్పడిన మార్పులతో దోమలవ్యాప్తి ఎక్కువైనట్లు చెప్పారు. మురు గునీటి నిల్వలను తొలగించడంలో అధికారులు విఫలమయ్యారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో నాగారపమ్మకు పొంగళ్లు

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), జూన్ 28: నర్రవాడ నాగారపమ్మ అమ్మవారికి భక్తులు పొంగళ్ల నైవేద్యంగా సమర్పించారు. తొలుత మహిళలు గ్రామంలోని ఎల్లమ్మతల్లికి ప్రత్యేక పూజలు చేసి నూతన బుట్టల్లో పొంగళ్ల సామగ్రితో మహిళలు మేళతాళాలు, బాణసంచా పేలుళ్లతో గ్రామపురవీదుల్లో ఊరేగింపుగా శివారులోని నాగారపమ్మ పుట్ట వద్దకు చేరుకొన్నారు. అనంతరం పుట్ట చుట్టూ ప్రదక్షణలు చేసి ఆవరణలో పొంగళ్ల చేసి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకొన్నారు. నిర్వాహకులు భక్తులు అన్నదానం చేశారు.


పొంగళ్ల సామగ్రితో ఊరేగింపుగా వెళుతున్న మహిళలు

ఉదయగిరి రూరల్: సున్నంవారిచింతలలో వెలసిన కోదండరామస్వామి ఉత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు గణపతి పూజ, పుణ్యహవచనం, కలశస్థాపన, నవగ్రహ మండపా రాధన, పంచామృతాభిషేకం, విశేష పూజలు, అలంకరణలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. సాయంత్రం స్వామివారిని ప్రత్యేక వాహనంలో ప్రతిష్ఠించి పురవీదుల్లో గ్రామోత్సవం చేపట్టారు.


ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కు పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న ఆలయ నిర్వాహకులు

వరికుంటపాడు: తూర్పురొంపిదొడ్లలో వెలసిన శ్రీమానసాదేవి ఆలయ వార్షికోత్సవాత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అర్చకులు అమ్మవారికి గణపతి పూజ, పుణ్యహవచనం, నవగ్రహమండపారాధన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు ఆలయ నిర్వాహకులు అర్చకులతో పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ చంద్ర మధుసూదన్‌రావు, టీడీపీ నాయకులు చంద్ర వెంక య్య, మహేశ్వరరెడ్డి, నాదిండ్ల రాజా, మల్లంపాటి వెంగయ్య, పేరం సుధాకర్‌రెడ్డి, తెల్లగొర్ల వెంకటయ్య పాల్గొన్నారు.

ఇసుక రీచ్ వద్ద కందకాల ఏర్పాటు

సంగం, జూన్ 28: మక్తాపురం పెన్నానది రీచ్ నుంచి ఇసుకను అక్రమంగా తరలించకుండా రెవెన్యూ అధికారులు శుక్రవారం చర్యలు చేపట్టారు. రీచ్‌లోకి వాహనాలు వెళ్లకుండా రహదారికి అడ్డంగా కందకాలు ఏర్పాటు చేయించారు. గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు కొద్ది రోజులుగా రాత్రి వేళల్లో పెన్నానది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారు. దీనిపై స్థానిక టీడీపీ నాయకులు అధికారులకు పిర్యాదు చేయడంతో ఈ చర్యలు తీసుకున్నారు. సంఘటన స్థలంలోని కందకాలు పూడ్చి అక్రమంగా రీచ్‌లోకి ప్రవేశించి ఇసుక తరలిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు.


ఇసుక రీచ్‌లోకి వెళ్లకుండా యంత్రంతో రహదారికి అడ్డంగా తవ్విన కందకం


పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక


ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

ఉదయగిరి రూరల్, జూన్ 28: గండిపాళెం జిల్లా ఉన్నత పాఠశాలలో 1996-97 విద్యా సం వత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు శుక్రవారం పాఠ శాలలో ఆత్మీయ సమావేశం ని ర్వహించారు. 28ఏళ్ల క్రితం చదువుకున్న వారంతా ఒకే వేది కపైకి చేరడంతో వారి ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. వివిధ ఉద్యోగాలు, వ్యాపారాల్లో స్థిరపడ్డ వారంతా సమావేశానికి హాజరయ్యారు. ఒకరినొకరు పరి చయం చేసుకుంటూ గత స్మృతులను నెమరవేసుకున్నారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు, ప్రస్తుత ఉపాధ్యాయులను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. అనంతరం సామూహిక భోజనం చేశారు.


నాడు-నేడు పనులు త్వరితగతిన పూర్తి చేయండి

ఉదయగిరి రూరల్, జూన్ 28: పాఠశాలల్లో జరుగుతున్న మనబడి నాడు-నేడు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆత్మకూరు డిప్యూటీ ఈవో కె.గోపాల్ సూచించారు. శుక్రవారం గండిపాళెం, వెంగళరావు నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను తనిఖీ చేసి పాఠశాలల్లో జరుగుతున్న నాడు-నేడు పనులను పరిశీలించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి రుచి చూశారు. విద్యార్థులకు ప్రభుత్వం సూచించిన మెనూ ప్రకారం భోజనం వడ్డించాలన్నారు. అనంతరం సంబంధిత రికార్డులు తనిఖీ చేసి సూచనలు, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు, నూర్జహాన్ పాల్గొన్నారు.


గండిపాళెం ఉన్నత పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న డిప్యూటీ ఈవో గోపాల్

గాజుల అలంకరణలో అలరించిన కలుగోళ శాంభవి

కావలిటౌన్, జూన్ 28: కావలి గ్రామదేవత కలుగోళశాంభవి శుక్రవారం ప్రత్యేక గాజుల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చక బృందం పర్యవేక్షణలో ఉదయం పంచామృతాభిషేక పూజలు నిర్వహించారు. సాయంత్రం సామూహిక లలిత సహస్రనామ పారాయణం చేశారు. అనంతరం పల్లకీ సేవ, విశేష పూజలు నిర్వహించారు. భక్తజనంతో ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.



వైద్యసేవలు మెరుగుపరచండి

- ఏరియా ఆసుపత్రిలో ఎమ్మెల్యే ఇంటూరి తనిఖీలు

కందుకూరు, జూన్ 28: కందుకూరు ఏరియా ఆసుపత్రిలో వైద్యసేవలు మెరుగుపరచాలని, పేషెంట్లు పట్ల బాధ్యతతో వ్యవహరించాలని, ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా ఏ చిన్న సంఘటన జరిగినా కఠినంగా వ్యవహరిస్తామని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన కందుకూరు ఏరియా ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని అన్ని విభాగాలను పరిశీలించటంతో పాటు వార్డులలో రోగుల వద్దకు వెళ్లి వారికి అందుతున్న సౌకర్యాలు, చికిత్స గురించి ఆరా తీశారు. ముఖ్యంగా ఆసుపత్రిలో ఇన్‌పేషెంట్లుకు అందిస్తున్న ఆహారం నాణ్యత, పరిమాణం గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం సూపరింటెండెంట్ డాక్టరు ఇంద్రాణి, ఇతర వైద్యులు, సిబ్బందితో సమావేశమై పరికరాలు, సదుపాయాల కొరత తదితర అంశాలపై సమీక్షించి పలు సూచనలు చేశారు. రోగులకు సరిపడా మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచుకోవాలని, ఆసుపత్రిలోనే ఎక్కువ కాన్పులు జరిగేలా చూడాలని, అందుబాటులో ఉన్న అధునాతన పరికరాలను సక్రమంగా ఉపయోగించి రోగులకు మెరుగైనసేవలు అందించాలని ఆదేశించారు. శానిటేషన్, తాగునీరు విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అవసరమైన మేరకు డాక్టర్లు లేరని, సిబ్బంది, వైద్య పరికరాల కొరత గురించి తనకు తెలుసునని, త్వరలోనే సంబంధిత మంత్రితో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు దామా మల్లేశ్వరరావు, నార్నె రోశయ్య, చిలకపాటి మధు, బెజవాడ ప్రసాద్, చదలవాడ కొండయ్య, షేక్ రఫి తదితరులు పాల్గొన్నారు.


ఆసుపత్రి సూపరింటెండెంట్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

ఇంటూరికి సన్మానం : పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీలో కందుకూరు ఎమ్మెల్యేగా ఎన్నికైన ఇంటూరి నాగేశ్వరరావును స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావుపై పూలవర్షం కురిపిస్తూ ఓపెన్‌టాప్ వాహనంపై ఊరేగింపుగా కాలనీలోకి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ పేదప్రజల సంక్షేమానికి పాటుపడ తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పిడికిటి వెంకటేశ్వర్లు, కంద్రా మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

అసోసియేషన్ల అధ్యక్షులకు సత్కారం


అసోసియేషన్ల అధ్యక్షులను సత్కరిస్తున్న సెవెన్ లైన్స్ సభ్యులు

కావలి, జూన్ 28: కావలి పట్టణ బులియన్ మర్చంట్స్, కుదువ వ్యాపారుల అసోసియేషన్‌లకు అధ్యక్షులుగా ఎన్నికైన మొగళ్లపల్లి రాజా, కోటా రమేష్‌లను శుక్రవారం కావలిలో సత్కరించారు. సెవెన్‌లైన్స్ సభ్యులు వారిని కలిసి శాలువాలు, పూలమాలలతో సత్కరించి అభినందనలు తెలిపారు. అనంతరం నూతన అధ్యక్షులు మాట్లాడుతూ బంగారువ్యాపారులు, కుదువ వ్యాపారులకు ఎలాంటి కష్టాలు వచ్చినా కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి సహకారంతో పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సెవెన్‌లైన్స్ సభ్యులు అనుమలిశెట్టి శివ, గాదంశెట్టి వేణుగోపాల్, పాదర్తి నాగరాజు, సువర్ణశ్రీను, పెట్టుగాని రమేష్, గాదంశెట్టి రవికుమార్,సుబ్బారావు, పెసల పవన్ పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శికి ఘన సన్మానం


చెన్నకేశవులు దంపతులను సత్కరిస్తున్న అధికారులు

కొండాపురం, జూన్ 28: పదవీ విరమణ చెందుతున్న పంచాయతీ కార్యదర్శికి శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఘనంగా సన్మానం జరిగింది. సాయిపేట పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన ఎల్.చెన్నకేశవులు ఈనెల 30వ తేదీన పదవీ విరమణ చెందుతున్నారు. దీంతో ఎంపీపీ బొడ్డు అనూరాధ, ఎంపీడీవో సుజాత, తహసీల్దారు మస్తానయ్య, కార్యాలయాల అధికారులు, సిబ్బంది చెన్నకేశవులు దంపతులకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, సర్పంచులు, వీఆర్‌వోలు, ఎంపీటీసీలు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో సమస్యలు పరిష్కరించండి

- కాకర్లకు వైద్య సిబ్బంది వినతి

కలిగిరి, జూన్ 28: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వింజమూరు తాలూకా పరిధిలోని కలిగిరి, వింజమూరు, కొండాపురం వైద్యశాలల్లో పనిచేస్తున్న ఏపీ హెల్త్ అడ్మినిస్ట్రేటివ్ మెడికల్ హెల్త్ సర్వీసెస్ అసోసియేషన్(ఏపీ హంస) సభ్యులు శుక్రవారం ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌ను బొమ్మరాజుచెరువు వద్ద పార్టీ కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ముందుగా వైద్య సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి శాలువా కప్పి అభినందనలు తెలిపారు. వివిధ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో హంస జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు కప్పా నారాయణరాజు, సభ్యులు ఎస్ చెంచురామయ్య, కే వెంకటసుబ్బయ్య, డీ దొరసానమ్మ, ఎం సరోజిని, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దళితుల భూములు లాక్కోవడం దుర్మార్గం

జలదంకి, జూన్ 28: పార్వతీపురం మన్యం జిల్లా శివం గ్రామంలో 1970లో ప్రభుత్వం అక్కడి దళితులు 14 మందికి 28 ఎకరాలు ప్రభుత్వభూమి పట్టాలు మంజూరు చేయగా వాటిని పెత్తందారీలు లాక్కోవడం దుర్మార్గమైన చర్య అని సీపీఎం నాయకుడు తాళ్లూరి మాల్యాద్రి ఖండించారు. స్థానిక సీపీఎం కార్యాలయం సురే చెంచురెడ్డి భవన్‌లో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తక్షణం ప్రభుత్వం కలుగజేసుకుని బాధిత దళిత కుటుంబాలకు న్యాయం చేసి దాడులకు పాల్పడ్డ పెత్తందారీలపై చట్టపరమై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు మేలంగి ఆంథోనీబాబు ఉన్నారు.

ప్రభుత్వం మారినా .. మారని సూచిక బోర్డులు!



ఉర్దూ స్కూల్ రోడ్డులో జగన్, రామిరెడ్డి ఫొటోలతో ఉన్న సూచిక బోర్డు

కావలి రూరల్, జూన్ 28: ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం అధికారం కోల్పోయి టీడీపీ అధికారం చేజిక్కించుకుంది. ప్రభుత్వం మారినా కావలి పట్టణంలో గత ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి, అప్పటి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిల ఫొటోలతో ఏర్పాటు చేసిన సూచిక బోర్డులు ఇంకా దర్శనమిస్తూనే ఉన్నాయి. పట్టణంలోని ఉర్దూ పాఠశాల రోడ్డులో ఉన్న 2వ వార్డు సచివాలయం సూచిక బోర్డు మార్చకపోవటంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సమయంలో కూడా సచివాలయంపై పార్టీ జెండాలు ఎగరవేసి ఉండటం అప్పట్లో చర్చనీయాంశమైంది. అధికారులు బోర్డు మార్చాలని స్థానికులు, టీడీపీ నేతలు కోరుతున్నారు.

రోడ్డుపైకి బోరుబావి మట్టి, నీరు..!

- బురదలో అవస్థలు పడ్డ ప్రజలు

కావలి, జూన్ 28: పట్టణంలోని ట్రంకు రోడ్డులో ఏరియా వైద్యశాల పక్కన చిన్న స్థలంలో నిబంధనలకు విరుద్ధంగా ఓ వ్యక్తి గురువారం రాత్రి బోర్ బావి తవ్వించారు. అందులో నుంచి వచ్చిన మట్టి నీటిని పక్కన గుంట తీసి అక్కడకు వదలాల్సింది పోయి రోడ్డు మీదకు వదిలారు. దీంతో ఆ ప్రాంతంలో రోడ్డంతా శుద్ధ మట్టి నీటితో బురదమయంగా మారింది. చుట్టుపక్కల వ్యాపారులు కూడా తమ దుకాణాలు తెరుచుకోలేని పరిస్థితి ఏర్పడింది. ఈ విషయం మున్సిపల్ అధికారులకు తెలపగా వారు పారిశుధ్య కార్మికులను పంపి ఎంత క్లీన్ చేసినా రోడ్డుపైన ఉన్న శుద్ధ మట్టి పోక పోగా ఆ మట్టి అంతా డ్రైనేజీలో చేరి కాలువ పూడి పోవడంతో దుకాణాల ముందు బురదమట్టితో వ్యాపారస్థులతో పాటు ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారు. మున్సిపల్ అధికారుల పర్యవేక్షణ లేకపోవటం వలనే ఈ పరిస్థితి నెలకొందని ప్రజలు వాపోతున్నారు.


ఏరియా వైద్యశాల వద్ద బోర్‌బావి మట్టి, నీరుతో బురదమయమైన రోడ్డు

సచివాలయ ఉద్యోగులతో పింఛన్ల పంపిణీ

అల్లూరు, జూన్ 28 : కొత్త ప్రభుత్వం ఏర్పడిన తరువాత తొలిసారిగా చేపట్టే పింఛన్ల పంపిణీ సచివాలయల సిబ్బందితోనే చేపట్టనున్నట్లు అల్లూరు నగర పంచాయతీ కమిషనర్ ఫణికుమార్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీడీవో జ్యోతి అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో శుక్రవారం జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి సచివాలయ సిబ్బంది తమ పరిధిలోని 60 నుంచి 70 ఇళ్లకు స్వయంగా వెళ్లి పింఛన్ల పంపిణీ చేపట్టాలన్నారు. అదేవిధంగా ఈనెల 30న ఆదివారం సెలవు దినం కావడంతో 29నే పింఛన్ల తాలూకు నగదును బ్యాంకుల నుంచి విత్‌డ్రా చేసుకోవాలన్నారు. సోమవారం 90 శాతంపైబడి పింఛన్ల పంపిణీ పూర్తి చేయాలని, మరుసటి రోజుతో నూరుశాతం పూర్తి చేయాలని సూచించారు.


మాట్లాడుతున్న కమిషనర్ ఫణికుమార్

గట్టుపల్లి గ్రామ సచివాలయంలో ప్రభుత్వాధినేతల చిత్రపటాల ఏర్పాటు

జలదంకి, జూన్ 28: మండలంలోని గట్టుపల్లి గ్రామ సచివాలయంలో శుక్రవారం భారత ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, ఎమ్మెల్యే కాకర్ల సురేష్ చిత్రపటాలను ఎన్డీఏ కూటమి నాయకులు ఏర్పాటు చేశారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు తల్లపనేని మధుసూదనరావు, కొల్లా క్రిష్ణ, గొట్టిపాటి ప్రసాద్‌నాయుడు, గొట్టిపాటి మనోజ్, అంబటి హరిప్రసాద్‌నాయుడు, జనసేన నాయకుడు నిమ్మలపల్లి రామ్‌చైతన్య తదితర నాయకులు పాల్గొన్నారు.


గట్టుపల్లి సచివాలయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధినేతల చిత్రపటాలు ఏర్పాటు చేసిన శ్రేణులు

సీఎం, డిప్యూటీ సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాల ఏర్పాటు

కావలిటౌన్, జూన్ 28: ముసునూరు 15వ వార్డు సచివాలయానికి శుక్రవారం సీఎం చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డిల చిత్రపటాలను స్థానిక టీడీపీ నేతలు బహూకరించారు. సచివాలయంలో నేతల చిత్రపటాలను ఏర్పాటు చేసి టీడీపీ, జనసేన శ్రేణులు మిఠాయిలు తినిపించి సంబరాలు జరుపు కున్నారు. కార్యక్రమంలో నేత లు, మాజీ కౌన్సిలర్ ఉప్పు వెంకటస్వామి, కన్నం శ్రీధర్, బిట్రగుంట వెంకట్రావు, కృష్ణ, నాయబ్, మహేష్, హరిరెడ్డి, రవి, మాధవ తదితరులు పాల్గొన్నారు.


15వ వార్డు సచివాలయంలో సీఎం, డిప్యూటీ సీఎం, ఎమ్మెల్యేల చిత్రపటాలతో టీడీపీ నేతలు

కమనీయం సీతారాముల కల్యాణోత్సవం

కందుకూరు, జూన్ 28: మండలంలోని మహదేవపురంలో శుక్రవారం సీతారాముల కల్యాణోత్సవం కనుల పండువగా జరిగింది. గ్రామస్థుల ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు హాజరైన సీతారాములును దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా డెయిరీ మాజీ చైర్మన్ చల్లా శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ సలహాదారు గుళ్లా శ్రీను, ఓరుగంటి రమణయ్య, సుధాకర్, నర్రా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

అతిసార వ్యాధిపై విద్యార్థులకు అవగాహన

ఉలవపాడు, జూన్ 28 : అతిసార వ్యాధి(డయేరియా)పై విద్యార్థులకు అవగాహన ఉండాలని చాకిచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ప్రణతి అన్నారు. శుక్రవారం చాకిచర్ల పెద్దపట్టపుపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు సలీంబాషా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె పాల్గొని విద్యార్థులకు డయేరియాపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి అవగాహన కల్పించారు. పాఠశాల సైన్స్ ఉపాధ్యాయులు వెలిచర్ల కోటేశ్వరరావు, శరత్‌లు అతిసార వ్యాధిపై ఈసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. అనంతరం గ్రామ పెద్దలు వైద్యాధికారిణిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది, ఉపాధాయులు, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.


డాక్టర్ ప్రణితిని సత్కరిస్తున్న గ్రామ పెద్దలు

నెల్లూరు సిటీ, రూరల్
కోవూరు, సర్వేపల్లి

వైద్య కళాశాలల్లో సమస్యలు పరిష్కరించాలి

● మంత్రి సత్యకుమార్‌కు ఏబీఆర్ఎస్ఎం నేతల వినతి



మంత్రి సత్యకుమార్‌ను సన్మానిస్తున్న ఏబీఆర్ఎస్ఎం నేతలు

వెంకటాచలం, జూన్ 28: వైద్య కళాశాలల్లోని సమస్యలను పరిష్కరించాలని అఖిల భారతీయ రాష్ట్రీయ సైక్సిక్ మహా సంఘ (ఏబీఆర్ఎస్ఎం) రాష్ట్ర శాఖ తరపున రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ వైవీ రామిరెడ్డి, ఎన్టీఆర్ జిల్లా కన్వీనర్ డాక్టర్ ఎం బాలసుబ్రహ్మణ్యం శుక్రవారం అమరావతిలో రాష్ట్ర వైద్యఆరోగ్య, కుటుంబసంక్షేమ శాఖామంత్రి వై సత్యకుమార్‌ను కోరారు. రాష్ట్రంలో నెలకొల్పిన నూతన వైద్య కళాశాలల్లో అధ్యాపకుల కొరత, మౌలిక వసతులు లేక విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని, అనేక వైద్య కళాశాలల్లో సరైన భవనాలు, అత్యాధునిక పరికరాలు లేక విద్యార్థులు సరైన విద్యను అభ్యసించలేకపోతున్నారన్నారు. రాష్ట్రంలోని వైద్య కళాశాలలు, అటాచ్డ్ రిఫరల్ హాస్పిటల్స్‌లో సూపర్ స్పెషాలిటి అధ్యాపకుల కొరత, అత్యాధునిక పరికరాల కొరతను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా మంగళగిరిలో కేంద్ర ప్రభుత్వం నెలకొల్పిన ఎయిమ్స్‌లో తీవ్రమైన నీటి కొరత ఏర్పడిందని, నీటి సదుపాయం లేక విద్యార్థులు, రోగులు, వైద్యులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ సమస్యలను పరిష్కరించడానికి ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు. కాగా, రాష్ట్రంలోని వైద్య కళాశాలలు, హాస్పిటల్స్‌లో సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపడతామని మంత్రి సత్యకుమార్ హామీ ఇచ్చినట్లు వైవీ రామిరెడ్డి పేర్కొన్నారు.

శేషశయనా వాస...

● వైభవంగా మహావిష్ణు బ్రహ్మోత్సవాలు



శేష వాహనంపై మహావిష్ణువు

నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 28 : నగరంలోని అయ్యప్పగుడి ప్రాంగణంలోని గురవాయురప్పన్ మహావిష్ణు ఆలయంలో బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. శుక్రవారం రాత్రి శేషవాహన సేవ కనుల పండువగా జరిగింది. ఉదయం అగ్నిప్రతిష్ఠ, ధ్వజారోహణం, అభిషేకం, సుదర్శన హోమం, నివేదన, శాత్తుమురై జరిగాయి. సాయంత్రం మహా కుంభ ఆరాధన, హోమం, నివేదన, శాత్తుమురై జరిగాయి. ఉభయకర్తలుగా పీటీ జగన్నాథం, పద్మజ, విష్ణుతేజ, శ్రీనివాస్, భార్గవి, చేబ్రోలు సురేంద్ర, సురేఖ, గడ్డం రత్నయ్య, సుజాతమ్మ వ్యవహరించారు. ఆలయ పాలక మండలి సభ్యులు పర్యవేక్షించారు.

మట్టి నమూనాల సేకరణ



మట్టి నమూనాలు సేకరిస్తున్న ఏడీఏ రాజ్‌కుమార్

ఇందుకూరుపేట, జూన్ 28: మండలంలోని పాములవారిపాలెంలో సహాయ వ్యవసాయ సంచాలకులు ఏ రాజ్‌కుమార్ వ్యవసాయ అధికారులు, రైతులతో కలిసి శుక్రవారం పొలాల్లో మట్టి నమూనాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులందరూ మట్టి నమూనా పరీక్షలు చేయించుకుంటే ఎరువుల మీద పెట్టే పెట్టుబడిని తగ్గించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి రఘునాథరెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు మాదయ్య, ఝాన్సీ, దీక్షిత, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు మెగా లోక్‌అదాలత్

కోవూరు, జూన్ 28: స్థానిక సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో శనివారం మెగా లోక్‌అదాలత్ నిర్వహించేందుకు న్యాయశాఖ ఉద్యోగులు ఏర్పాట్లు పూర్తిచేశారు. సీనియర్ సివిల్ జడ్జి చైతన్య, మేజిస్ట్రేట్ కాత్యాయని కేసుల్ని పరిష్కరిస్తారు. పలు బ్యాంకులు, బీఎస్ఎన్ఎల్ శాఖ సిబ్బంది లోక్‌అదాలత్‌లో పాల్గొని కేసుల్ని పరిష్కరిస్తారు. కోవూరు, కొడవలూరు, విడవలూరు, అల్లూరు, దగదర్తి పోలీసుస్టేషన్ల పరిధిలోని క్రిమినల్ కేసుల్ని కూడా పరిష్కరించనున్నారు.

పుస్తకావిష్కరణ

కొడవలూరు, జూన్ 28: పంచాయతీ పరిధిలోని వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాలలో ఇంటర్‌నెట్ ఆఫ్ థింగ్స్ పుస్తకాన్ని కళాశాల చైర్మన్ పి గుణశేఖర్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పుస్తకం రాసిన ప్రొఫెసర్ డాక్టర్ వెంకట నాగేంద్ర, దీప్తిలను అభినందించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రకాష్ రావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఏవో గిరిష్, ఆర్ అండ్‌డి డీన్ డాక్టర్ నాగేంద్ర పాల్గొన్నారు.

నాగూర్‌నాగపట్నంలో టీడీపీ నేతల పూజలు



శిరోముండనం చేయించుకున్న టీడీపీ నేతలు

విడవలూరు, జూన్ 28: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, నెల్లూరు ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిలు సార్వత్రిక ఎన్నికల్లో భారీ మెజార్టీతో విజయం సాధించిన సందర్భంగా తమిళనాడులోని నాగూర్‌నాగపట్నంలో శుక్రవారం టీడీపీ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించి శిరోముండనం చేయించుకున్నారు. ఈసందర్భంగా మండల కోఆప్షన్ సభ్యుడు ఎస్‌కె రఫీ మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి అరాచక పాలన అంతం కావాలని మొక్కుకున్నామని అందువలన మొక్కు తీర్చుకున్నా మని తెలిపారు. ఆయన వెంట టీడీపీ సీనియర్ నాయకులు పొన్నలూరు పురంధర్‌రెడ్డి, రాష్ట్ర ఐటీడీపీ కార్యదర్శి సత్యంరెడ్డి, నాయకులు వేటగిరి వెంకయ్య, ప్రభగిరి ప్రభాకర్, ధనయ్య, తదితరులు పాల్గొన్నారు.

నారాయణ సార్ ఆదుకున్నారు!

● అగ్ని ప్రమాద బాధితులు



బాధితులతో మాట్లాడుతున్న జనసేన నేతలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జూన్ 28: అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయి రోడ్డున పడ్డ తమను మంత్రి నారాయణ సార్ అన్ని విధాల ఆదుకున్నారని బర్మాషెల్ గుంట ప్రాంత ప్రజలు తెలిపారు. అగ్ని ప్రమాద బాధితులకు ఏర్పాటు చేసిన తాత్కాలిక నివాసాల వద్ద బాధితుల ను శుక్రవారం రాత్రి జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ పరామర్శించారు. బాధితులు మాట్లాడుతూ తక్షణ సాయం కింద సొంత నిధులు, ప్రభుత్వం నుంచి వచ్చినది కలిపి మొత్తం రూ.1.38 లక్షలు ఒక్కో కుటుంబానికి అందజేశారన్నారు. ప్రమాదం జరిగిన రెండో రోజే తాత్కాలిక ఇళ్లలో నివాసం ఏర్పరిచి నిత్యావసర వస్తువులు సమకూర్చార న్నారు. గాయపడ్డవారికి నారాయణ వైద్యశాలలో ఉచితంగా చికిత్స అందిస్తున్నా రని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుల్తాన్ బాషా, షాజహాన్, హరి తదితరులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

నెల్లూరు రూరల్, జూన్ 28: మండలంలోని కోడూరుపాడు జడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు శుక్రవారం ఎంఈవో మురళీధర్ నేతృత్వంలో దాతలు విద్యా సామగ్రిని అందచేశారు. సుమారు రూ. 46 వేల విలువ చేసే ఈ సామాగ్రి విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతాయని ఎంఈవో తెలిపారు. కార్యక్రమంలో దాతలు కారణి సాయి ప్రవీణ్, తోట శివకుమార్, హెచ్ఎం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వైభవంగా కామాక్షితాయికి కుంకుమార్చన



కుంకుమార్చన చేస్తున్న అర్చకులు

బుచ్చిరెడ్డిపాళెం, జూన్ 28: మండలంలోని జొన్నవాడ మల్లికార్జునస్వామి, కామాక్షితాయి ఆలయంలో శుక్రవారం అమ్మవారికి సామూహిక కుంకుమార్చన వైభవంగా నిర్వహించారు. అనంతరం పల్లకీ సేవలో భాగంగా అమ్మవారిని ఆలయంలో ఊరేగించారు. ఉదయం మల్లికార్జునస్వామికి నిత్య కల్యాణోత్సవం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. పలువురు మహిళా భక్తులు ఆలయంలో దీపారాధన చేశారు.

జీవశాస్త్ర ఉపాధ్యాయుడికి పదవీ విరమణ సన్మానం



కృష్ణయ్యను సన్మానిస్తున్న సహోపాధ్యాయులు

పొదలకూరు, జూన్ 28: పట్టణంలోని డీఎన్ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత 8 సంవత్సరాలుగా జీవశాస్త్ర ఉపాధ్యాయుడిగా పని చేస్తూ ఈనెల 30వ తేదీన పదవీ విరమణ చేస్తున్న జీవశాస్త్ర సహోపాధ్యాయుడు పరదేశి కృష్ణయ్యను పాఠశాల సిబ్బంది శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్ర మానికి అధ్యక్షత వహించిన పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సనత్‌కుమార్ మాట్లాడుతూ కృష్ణయ్య వృత్తి పట్ల అంకితభావంతో పనిచేసి తోటి ఉపాధ్యాయులకు మార్గదర్శకుడిగా నిలిచారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పొదలకూరు సబ్ ట్రెజరరీ అధికారి కాలేషా, మండలంలోని ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ, మురళి, అనీల్‌కుమార్, సునంద, తదితరులు పాల్గొన్నారు. ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులు ఏవీ సుధాకర్, ఇతర ఉపాధ్యాయులు, బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే పింఛను

తోటపల్లిగూడూరు, జూన్ 28 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం జూలై 1వ తేదీ ఉదయం నుంచి పింఛనుదారుల ఇంటి వద్దనే సచివాలయ సిబ్బంది ద్వారా పింఛను పంపిణీ చేస్తామని మండల అభివృద్ధి అధికారి కె బాలాజీ తెలిపారు. శుక్రవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ మండలంలో లబ్ధిదారులు 7544 మందికి పింఛను సొమ్ము వారి వారి గృహాల వద్దనే కేటాయించబడిన సచివాలయ సిబ్బంది, ప్రభుత్వ ఉద్యోగుల ద్వారా పంపిణీ చేస్తామని తెలిపారు.

పంచాయతీల్లో చిత్రపటాల ఏర్పాటు



చిత్రపటాలను ఆవిష్కరిస్తున్న టీడీపీ నేతలు

విడవలూరు, జూన్ 28: మండల పరిధిలోని గాదెల దిన్నె, వరిణి పంచాయతీ కార్యాలయాల్లో దేశప్రధాని న రేంద్రమోడి, రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిల చిత్రపటాలను శుక్రవారం స్థానిక టీడీపీ నాయకులు ఆవిష్కరించారు. అనంతరం కార్యాలయంలో గోడలకు తగిలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలను ప్రజల్లోకి తీసుకుపోతామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కుడుముల మల్లికార్జున, సునీల్, వెల్లంపల్లి దిలిప్, కోడిమేర్ల శేషయ్య, రాజన్న, తూళ్లూరు మాధవ్, బీజేపీ, జనసేన నాయకులు, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు : ఏఎంవో



ఎంఈవోని సన్మానిస్తున్న ఏఎంవో

మనుబోలు, జూన్ 28: ప్రభుత్వ ఉద్యోగులు అంకిత భావంతో పనిచేస్తే గుర్తింపు, గౌరవం దక్కుతాయని సమగ్ర శిక్షా అభియాన్ ఏఎంవో సుధీర్ బాబు అన్నారు. మండల విద్యా శాఖాధికారి శనగల శేషాద్రి వాసు ఈనెల 30వ తేదీన ఉద్యోగ విరమణ సందర్భంగా శుక్రవారం స్థానిక పద్మావతి కల్యాణ మండపంలో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు, ఉపాధ్యాయులు ఎంఈవోను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో ప్రసాద్, సీఎంవో సుబ్రమణ్యం, నెల్లూరు ఎంఈవోలు తిరుపాలు, భిక్షాలు, మనుబోలు ఎస్ఐ అజయ్‌కుమార్, అక్కంపేట మాజీ సర్పంచు ఎన్ కిరణ్ కుమార్‌రెడ్డి, మండల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

తిరుమలకు టీడీపీ నేతల పాదయాత్ర



తిరుమలకు పాదయాత్ర చేస్తున్న టీడీపీ నేతలు

మనుబోలు, జూన్ 28: సర్వేపల్లి ఎమ్మెల్యేగా సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి గెలుపొందడంతో శుక్రవారం టీడీపీ నాయకులు, కార్య కర్తలు స్థానిక అంబేడ్కర్ నగర్ నుంచి కాలినడకన తిరుమలకు తరలివెళ్ళారు. మొక్కు తీర్చేందుకు వెళుతున్నట్లు టీడీపీ నాయకుడు చింతల వెంకటే శ్వర్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి తిరుపతి పార్లమెంటరీ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామిరెడ్డి, మాజీ ఎంపీపీ చేరెడ్డి పట్టాభిరామిరెడ్డి, తెలుగురైతు రాష్ట్ర కార్యదర్శి రాయపాటి కిరణ్‌కుమార్ తదితరులు సంఘీభావం తెలిపారు.

ముదివర్తి ఇసుక రీచ్‌లో అక్రమ తవ్వకాలు

● పట్టించుకోని అధికారులు

విడవలూరు, జూన్ 28 : మండల పరిధిలోని ముదివర్తి గ్రామ సమీపంలో ఉన్న ఇసుక రీచ్‌లో అక్రమ తవ్వకాలు గత రెండు రోజుల నుంచి సాగుతున్నాయి. రాత్రిళ్లు జేసీబీలతో తవ్వకాలు జరుపుతున్నారు. ముదివర్తికి చెందిన అక్రమార్కులు ఇసుక రీచ్‌లో నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు జరుపుతున్నారు. ముదివర్తి ఇసుక రీచ్‌కు ఎటువంటి అనుమతులు లేవు. అయినా అధికారులు తవ్వకాలు జరుగుతున్నా చోద్యం చూస్తున్నారు. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ప్రభుత్వ అనుమతులు లేకుండా ఎటువంటి తవ్వకాలు చేయకుడదని స్పష్టంగా ఆదేశాలు జారీ చేసినా ముదివర్తి ఇసుక రీచ్‌లో తవ్వకాలు జరుగుతుండడంతో టీడీపీ నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రోజుకి 200 ట్రాక్టర్ల ఇసుక రవాణా

ముదివర్తి ఇసుక రీచ్ నుంచి రోజుకి 200 ట్రాక్టర్లు చొప్పున ఇసుక అక్రమ రవాణా జరుగు తున్నట్లు ప్రాథమిక సమాచారం. ఒక్కొక్క ట్రాక్టర్‌కు రూ.2వేల నుంచి రూ.3వేలు వసూలు చేస్తూ కోవూరు, పోతిరెడ్డిపాలెం, కొడవలూరు, అల్లూరు మండలాలకు సరఫరా చేస్తున్నారు. దీనిపై జిల్లా ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుకున్నారు.

తహసీల్దార్ విజయకుమార్‌కు లోకేష్ అభినందన



తుమ్మా విజయకుమార్‌ను అభినందిస్తున్న మంత్రి నారా లోకేష్

నెల్లూరు(హరనాథపురం), జూన్ 28 : సార్వత్రిక ఎన్నికల సమయంలో సమన్వయ తహసీల్దార్, పరిపాలనాధికారి, ఏఆర్వో తహసీల్దార్‌గా తాడేపల్లిలో మూడు పోస్టులు ఒకే సారి నిర్వహించిన తుమ్మా విజయ కుమార్‌ను ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ అభినందించారు. విజయకుమార్ నెల్లూరు జిల్లావాసి. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేస్తూ ఎన్నికల బదిలీల్లో భాగంగా గుంటూరు కలెక్టరేట్‌కు వెళ్లారు. ఎన్నికల సమయంలో మూడు పోస్టులను సమర్థవంతంగా నిర్వహించారు. దీంతో శుక్రవారం విజయ కుమార్‌ను లోకేష్ తన కార్యాలయానికి పిలిపించి ప్రశంసించారు.

దుర్గమ్మ సేవలో బొల్లినేని కృష్ణయ్య దంపతులు



బొల్లినేని కృష్ణయ్యకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో కేఎస్ రామారావు

విజయవాడ (వన్‌టౌన్), జూన్ 28: కనకదుర్గమ్మపై మనస్సును స్థిరంగా ఉంచకపోతే ఎన్ని యజ్ఞ, యాగాలు చేసినా జప, తపాలు చేసినా ఉప యోగం ఉండదని కిమ్స్ ఆస్పత్రి చైర్మన్, మాజీ ఎమ్మెల్యే బొల్లినేని కృష్ణయ్య అన్నారు. దుర్గగుడిలో శుక్రవారం వేకువజామున జరిగిన ఖడ్గమాలార్చనలో తన సతీమణి పురావస్తు శాఖ కమిషనర్ వాణీమోహన్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. అనంతరం వారితో పురాణపండ శ్రీనివాస్ రాసిన శ్రీమాలిక 25వ ప్రచురణ, మంగళగిరి నరసింహస్వామిపై రాసిన నరసింహం, ఉగ్రసింహం పుస్తకాలను ఈవో కేఎస్ రామారావు ఆవిష్కరింపజేశారు. బొల్లినేని కృష్ణయ్య దంపతులకు అమ్మవారి దర్శనానంతరం వేద పండితులు వేదాశీర్వచనం చేశారు. అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటాన్ని ఈవో అందజేశారు.

'నీట్' రద్దు చేయాలి

● పీడీఎస్‌యూ ఆందోళన



ఆందోళన చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

నెల్లూరు (విద్య), జూన్ 28 : దేశవ్యాప్తంగా వైద్యవిద్య కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్ పరీక్షను రద్దు చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ఎం సునీల్ డిమాండ్ చేశారు. నగరంలోని మినీబైపాస్ రోడ్డులో శుక్రవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆందోళన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నీట్ పరీక్షల్లో భారీ స్థాయిలో అవినీతి అక్రమాలు చోటుచేసుకున్నాయన్నారు. కష్టపడి చదివిన విద్యార్థులకు సీట్లు రాకుండా చదువు రాని వారికి సీట్లు వచ్చే విధంగా కొంతమంది కుట్ర చేశారని విమర్శించారు. పేపర్ లీకేజీకి పాల్పడిన వారిపై సీబీఐతో విచారణ జరిపించాలని, ఎన్‌టీఏను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నీట్‌ను మరోసారి నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌కే షారూఖ్, నగర అధ్యక్షుడు ఆశిర్, సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా రోటరీ కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం



రోటరీ క్లబ్ ప్రమాణ స్వీకార సభలో నాయకులు

నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 28 : నగరంలోని రోటరీ ఆడిటోరియంలో శుక్రవారం రాత్రి రోటరీ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం ఘనంగా జరిగింది. డిస్ట్రిక్ట్ మాజీ గవర్నర్లు జీవీ విశ్వనాథ్, దొడ్ల భరతకుమార్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. క్లబ్ నూతన అధ్యక్షుడిగా బెజవాడ నరేష్ చంద్రారెడ్డి, కార్యదర్శిగా పీ అఖిలేష్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్‌గా టీ ఉదయభాస్కర్‌రావు, జాయింట్ సెక్రటరీగా వై.రమణారెడ్డి తదితరులు ప్రమాణం చేశారు.

వసతి గృహాల్లో నిబంధనలు తప్పనిసరి : ఎంహెచ్‌వో

నెల్లూరు(సిటీ), జూన్ 28 : ప్రైవేట్ విద్యా సంస్థలకు చెందిన వసతి గృహాల్లో మున్సిపల్ నియమ, నిబంధనలు పాటించకుంటే వాటిని మూతేస్తామని ఎంహెచ్‌వో డాక్టర్ వెంకట రమణయ్య హెచ్చరించారు. శుక్రవారం నగరంలోని అన్నమయ్య సర్కిల్, గోమతినగర్‌లోని కార్పొరేట్ కళాశాలలకు అనుబంధంగా నడుస్తున్న వసతి గృహాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పారిశుధ్యం, సురక్షితమైన తాగునీరు, మెరుగైన మరుగుదొడ్లు ఉండాలని నిర్వాహకులకు సూచించారు. వంటశాలలు, ఆహారం తినే గదుల్లో పరిశుభ్రత పాటించాలని ఆయన ఆదేశించారు.

ప్రభుత్వ భూమికి ఫోర్జరీ పట్టాలా..?

● బాధ్యులపై చర్యలు తీసుకోవాలి : సీపీఐ



మాట్లాడుతున్న వాటంబేటి నాగేంద్ర

నెల్లూరు (వైద్యం), జూన్ 28 : అధికారుల సంతకాలు ఫోర్జరీ చేసి ప్రభుత్వ భూమికి పట్టాలు పుట్టించిన వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ నేతలు డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఐ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో పార్టీ జిల్లా నేత వాటంబేటి నాగేంద్ర మాట్లాడారు. నగరంలోని ఇరగాళమ్మ సంఘం వద్ద ఉన్న 85 సెంట్ల ప్రభుత్వ భూమిని అధికారుల అండదండలతో కొందరు కైవసం చేసుకున్నారన్నారు. ప్రభుత్వ భూమిలో లేఅవుట్ వేసి గత ప్రభుత్వం అండదండలతో విచ్చలవిడిగా ఆక్రమణలకు పాల్పడ్డారని ఆరోపించారు. దీని వెనుక అధికారుల పాత్ర కూడా ఉందని వెల్లడించారు. వీటన్నింటిపై విజిలెన్స్‌తో సమగ్ర విచారణ జరిపి అక్రమాలకు పాల్పడ్డవారిపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర నాయకులే లీలామోహన్, సతీష్, లజపతిరాయ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి పంపిణీ

నెల్లూరు (విద్య), జూన్ 28 : నగరంలోని కొండాయపాళెం నగరపాలక ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. స్థానిక కార్పొరేటర్ చేజర్ల మహేష్ మాట్లాడుతూ పిల్లలను ప్రతిరోజూ పాఠశాలలకు పంపేలా తల్లిదండ్రులు చొరవ తీసుకోవాలన్నారు. 6 నుంచి 14 ఏళ్లలోపు బడిబయట పిల్లలను గుర్తించి పాఠశాలలో చేర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం భాస్కర్‌రావు, నాయకులు దామోదర్‌రెడ్డి, మల్లి, రవి, డేవిడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి క్యారమ్స్ పోటీలు ప్రారంభం



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు శ్రీమన్నారాయణ

నెల్లూరు (విద్య), జూన్ 28 : నగరంలోని నెల్లూరు క్లబ్‌లో శుక్రవారం జిల్లా క్యారమ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి క్యారమ్ ర్యాంకింగ్ పోటీలు ప్రారంభమయ్యాయి. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ శ్రీమన్నారాయణ మాట్లాడుతూ జిల్లాలో క్యారమ్ క్రీడను అభివృద్ధి చేసేందుకు, యువతలో క్రీడా స్ఫూర్తిని నింపేందుకు పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. క్రీడాకారులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లాస్థాయిలో గెలుపొందిన వారిని రాష్ట్ర పోటీలకు పంపిస్తామని తెలిపారు. అనంతరం ఏపీ ట్రాన్స్‌కో మాజీ డైరెక్టర్ జే వెంకటేశ్వరరావు, రాష్ట్ర క్యారమ్ అసోసియేషన్ సీనియర్ ఉపాధ్యక్షుడు కాకుల సుబ్బారావు, నెల్లూరు క్లబ్ అధ్యక్షుడు పీ సుధాకర్‌రెడ్డి, మారంరెడ్డి మహేష్‌రెడ్డి పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి వీఆర్ శ్రీధర్, సభ్యులు పాల్గొన్నారు.


నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు (జడ్పీ), జూన్ 28 : నగరంలోని రైతు బజార్, గోమతి నగర్, వెంకటేశ్వరపురం, ఆటో నగర్, మార్కెట్ యార్డ్ సబ్ స్టేషన్ల పరిధిలో విద్యుత్ లైన్లకు మరమ్మతులు చేస్తున్నందున శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ సోమశేఖర్‌రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బోడిగాడి తోట, వీవర్స్ కాలనీ, సత్యనారాయణపురం, నజీర్‌తోట, నవాబుబీపేట, కుసుమహరిజనవాడ, ముత్యాలపాళెం, రామలింగాపురం, మినీబైపాస్, టిడ్కో సముదాయం, జ్యోతినగర్, టీచర్స్‌కాల నీ, వేదాయపాళెం తదితర ప్రాంతాల్లో సరఫరా ఉండదని తెలియజేశారు.

కార్పొరేట్ విద్యాసంస్థపై చర్యలు తీసుకోవాలి

● అపస్మా నేతల డిమాండ్

నెల్లూరు (విద్య), జూన్ 28 : విద్యావ్యవస్థలో నిబంధనలను తుంగలో తొక్కి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న కార్పొరేట్ విద్యాసంస్థపై చర్యలు తీసుకోవాలని అపస్మా నేతలు డిమాండ్ చేశారు. నగరంలోని శ్రీ నేతాజీ పైలట్ పాఠశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఒకే ఎడ్యుకేషనల్ సొసైటీ కింద నగరంలో ఐదు నూతన పాఠశాలలను ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రారంభించారన్నారు. ఇంటింటికి తిరిగి తల్లిదండ్రులను ప్రలోభాలకు గురిచేస్తూ తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. దీనిపై కోర్టును ఆశ్రయించగా పార్థసారథి నగర్‌లో ప్రారంభించిన పాఠశాల అనుమతులను రద్దు చేసిందని చెప్పారు. దర్గామిట్టలోని సరస్వతి నగర్‌లో ప్రారంభిస్తున్న పాఠశాలకు అనుమతుల మంజూరు వెనుక్కు తీసుకున్నారన్నారు. తల్లిదండ్రులు దీన్ని గుర్తించాలని కోరారు. ఈ సమా వేశంలో అపస్మా జిల్లా అధ్యక్షుడు ఎస్ శ్రీధర్, కార్యదర్శి వెంకట్రామయ్య, కోశాధికారి కృష్ణారావు, రాష్ట్ర సీనియర్ ఉపాధ్యక్షుడు ఎంవీ సుబ్బారెడ్డి, ఉపాధ్యక్షులు రమణారెడ్డి, నగరాధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు వెంకటాద్రి తదితరులు పాల్గొన్నారు.




విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

రేపు 'విశాలాక్షి' వార్షికోత్సవం

నెల్లూరు (సాంస్కృతికం) జూన్ 28 : విశాలాక్షి మాసపత్రిక 15వ వార్షికోత్సవం ఆదివారం నిర్వహిస్తున్నట్లు 25 కళాసంఘాల అధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి తెలిపారు. శుక్రవారం 25 కళా సంఘాల సినీ స్టూడియోలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వార్షికోత్సవం ఉదయం 10గంటలకు పురమందిరంలోని ఏసీ హాలులో జరుగుతుందని తెలిపారు. పత్రిక సంపాకుడు ఈతకోట సుబ్బారావు మాట్లాడుతూ వార్షికోత్సవం సందర్భంగా జాతీయ స్థాయి కథల పోటీలు నిర్వహించామన్నారు. విజేతలకు బహుమతి ప్రదానం చేస్తామన్నారు. సమావేశంలో కోసూరు రత్నం, దంపూరు రాధాకృష్ణ, ఎస్‌వీ నాగగాయత్రి, 25 కళా సంఘాల కన్వీనర్లు కలిసి వార్షికోత్సవం బ్రోచర్లు ఆవిష్కరించారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తిరుపతి
జిల్లా వార్తలు
శనివారం 29 జూన్ 2024






దిల్ రుబా ఆఖరి కళాకారుడు
శ్రీనివాసరావు మృతి


వెంకటగిరి టౌన్, జూన్ 28 : వెంకటగిరికి చెందిన అరుదైన దిల్‌రుబా వాయిద్య కళాకారుడు శ్రీనివాసరావు కన్నుమూశారు. ఆయన వయసు 104 సంవత్సరాలు. రాయదుర్గంలోని తన మేనల్లుడు డాక్టర్ గోపాల్ వద్ద కొంతకాలంగా ఉంటున్న శ్రీనివాసరావు గురువారం రాత్రి ఆఖరిశ్వాస విడిచారు. హిందుస్థానీ వాయిద్యం అయిన దిల్‌రుబా మీద కర్ణాటక సంగీతాన్ని పలికించడం శ్రీనివాసరావు ప్రత్యేకత. ఉత్తర భారతదేశంలోనే అరుదైన ఈ సంగీత వాయిద్యాన్ని దక్షిణభారతదేశంలో వాయించే ఆఖరి కళాకారుడు ఈయన. వయోలిన్, జలతరంగిణీ, హార్మోనియం, కీ-బోర్డు ల్లోనూ శ్రీనివాసరావు దిట్ట. 1933 నుంచి వెంకటగిరిలోని అమెచ్యూర్ ఆర్టిస్ట్ అసోసియేషన్, వెంకటగిరి ఆర్ట్స్ థియేటర్, కల్చరల్ ఆర్ట్ థియేటర్స్, నట సమాఖ్య, ఆజాద్ అమెచ్యూర్ ఆర్టిస్ట్స్ వంటి సంస్థల్లో ఆయన క్రియాశీలకంగా వ్యవహరించారు. 1940-50 మధ్య వెంకటగిరి క్లబ్ కార్యదర్శిగా పది సంవత్సరాలు సేవలందించారు. పంచాయతీ బోర్డు సభ్యుడిగానూ పనిచేశారు. ఎస్వీబీసీ మాజీ ఛైర్మన్ వీబీ సాయికృష్ణ యాచేంద్ర సంగీత గేయధారకు హార్మోనియం సహకారం అందించారు.ఆచార్య ఆత్రేయతో మంచి సాన్నిహిత్యం ఉండేది. శ్రీనివాసరావు సంగీతమే ఊపిరిగా జీవించారు. పెళ్లి చేసుకోలేదు. కొన్నేళ్లుగా మేనల్లుడి వద్ద ఉంటూ గురువారం కన్నుమూశారు.

తిరుమల ఘాట్‌లో
కలకలం



ఏనుగుల సంచారంతో శుక్రవారం సాయంత్రం తిరుమల మొదటి ఘాట్‌రోడ్డులో కలకలం రేగింది. ఏడవమైలు వద్ద 10ఏనుగులతో పాటు 3గున్న ఏనుగులు రోడ్డు సమీపానికి రావడం గమనించిన యాత్రికులు హడలిపోయారు.టీటీడీ ఫారెస్ట్ సిబ్బంది శబ్దాలు చేయడంతో 20 నిమిషాల తర్వాత ఏనుగులు అడవిలోకి వెళ్లిపోయాయి.మళ్లీ రాత్రి 8-9గంటల నడుమ మరోసారి ఏనుగుల గుంపు రోడ్డు సమీపానికి రాగా అడవిలోకి తరిమి వేసినట్లు అధికారులు తెలిపారు.





- తిరుమల, ఆంధ్రజ్యోతి

వర్సిటీల్లో రాజీనామాల పర్వం

- వేద,ద్రావిడ,ఎస్వీ విశ్వవిద్యాలయాల్లో వీసీ పదవులను వీడిన ప్రముఖులు
- వారంలో రాజీనామాలకు ఆమోదం
- తర్వాతే ఇన్‌చార్జులను నియమించే అవకాశం



శ్రీకాంత్ రెడ్డి



రాణీ సదాశివమూర్తి



మధుజ్యోతి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 28: గత ప్రభుత్వ హయాంలో యూనివర్సిటీలకు నియమితులైన వీసీలు, రిజిస్ట్రార్లు పదవులకు రాజీనామాలు చేస్తున్నారు. ద్రావిడ విశ్వవిద్యాలయం ఉపకులపతి పదవికి ఆచార్య కొలకలూరి మధుజ్యోతి శుక్రవారం రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాలతో తన పదవికి రాజీనామా సమర్పిస్తున్నట్లు ఉన్నత విద్య కార్యదర్శికి పత్రాన్ని పంపారు. తిరుపతిలోని పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం తెలుగు విభాగంలో ఆచార్యులుగా ఉన్న మధుజ్యోతి 2023 డిసెంబరు 29న వీసీగా బాధ్యతలు చేపట్టారు.ఇక్కడ వైసీపీ నాయకుల అండతో రిజిస్ట్రార్‌గా పదవి పొందిన ఏకే వేణుగోపాల్‌రెడ్డి ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే జూన్ 4న రాజీనామా చేశారు. అప్పట్లో ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్‌గా మాధవ నాయుడిని వీసీ నియమించారు. ఆ మరుసటిరోజు రెక్టార్ అనురాధ కూడా రాజీనామా చేశారు. ఆమె స్థానంలో కొత్త రెక్టార్ నియామకం ఇంకా జరగలేదు. వేద విశ్వవిద్యాలయ వీసీ రాణీసదాశివమూర్తి తన పదవికి శుక్రవారం రాజీనామా చేశారు.ఎస్వీయూ వీసీ శ్రీకాంత్ రెడ్డి తన పదవికి రాజీనామా చేశారు. గతంలోనే రిజిస్ట్రార్ హుస్సేన్ చేసిన రాజీనామాకు ఆమోదం లభించింది. ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా చంద్రయ్యను నియమించారు. నెల్లూరులోని విక్రమసింహపురి యూనివర్సిటీ వీసీ సుందరవల్లి రాజీనామా చేశారు. ఈమె ఎస్వీయూ ఇంగ్లీషు విభాగంలో అధ్యాపకురాలిగా మరికొంత కాలం కొనసాగేందుకు అవకాశం ఉంది. ఆమె భర్త క్రిస్టఫర్ గతంలో రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ కార్యదర్శిగా, ఎస్వీ ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా వ్యవహరించారు. పద్మావతి యూనివర్సిటీ వీసీ భారతి ప్రస్తుతం అధికారిక కార్యక్రమాల్లో పాల్గొనడానికి కోల్‌కాతాకు వెళ్ళారు.అక్కడి నుంచి వచ్చాకే రాజీనామా విషయంపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

ఎస్వీయూలో నేడు ఏఐఎస్‌ఎఫ్ సమావేశాలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 28: ఏఐఎస్‌ఎఫ్ జాతీయ సమితి సమావేశాలు తిరుపతిలో శనివారం నిర్వహించనున్నారు. ఉదయం 11 గంటలకు ఎస్వీయూనివర్సిటీ సెనేట్ హాల్లో ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది. సభకు సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ పాండా, రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, ఏఐఎస్‌ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి దినేష్ శ్రీరంగరాజ్, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుజ్జుల ఈశ్వరయ్య హాజరు కానున్నారు.

డీసీసీబీ, సీడీసీఎంఎస్‌లకు
పీఐసీగా జేసీ బాధ్యతల స్వీకరణ

- 25 విండోలకు అధికారుల నియామకం



పర్సన్ ఇన్‌చార్జిగా బాధ్యతలు తీసుకుంటున్న జేసీ

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 28:చిత్తూరు జిల్లా జిల్లా సహకార కేంద్ర బ్యాంకు(డీసీసీబీ), సహకార మార్కెటింగ్ సొసైటీ(సీడీసీఎంఎస్)లకు పర్సన్ ఇన్‌చార్జిగా జేసీ శ్రీనివాసులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ రెండు సహకార సంఘాలకు పీఐసీగా ప్రభుత్వం జేసీని నియమించిన విషయం తెలిసిందే.చిత్తూరు కలెక్టరేట్‌లోని జేసీ చాంబర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో డీసీవో నాగవర్ధన్, సీఈవో మనోహర్ గౌడ్, బిజినెస్ మేనేజర్ శ్రీధర్‌నాయుడు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఇదివరకు వీటికి సెవన్‌మెన్ నాన్ అఫిషియల్ కమిటీలు ఉండగా కొత్త ప్రభుత్వం ఏర్పడడంతో కమిటీలు తమ పదవులకు రాజీనామా చేయడంతో ఖాళీ ఏర్పడింది. జేసీ శ్రీనివాసులు ఈ పదవిలో ఆరు నెలల పాటు లేదా పాలకవర్గ ఎన్నికలయ్యేంత వరకు కొనసాగుతారు. కాగా, 25 విండోలకు సంబంధించి అఫిషియల్ పర్సన్ ఇన్‌చార్జులుగా డీసీవో నాగవర్ధన, సహకార శాఖకు చెందిన అసిస్టెంట్ రిజిస్ట్రార్, సీనియర్ ఇన్‌స్పెక్టర్లను నియమించగా వారు బాధ్యతలు స్వీకరించారు. వీరు ఈ ఏడాది డిసెంబరు 20వ తేదీ వరకు పదవిలో కొనసాగుతారు.

పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు

చిత్తూరు లీగల్/గుడుపల్లె, జూన్28: బాలికపై అత్యాచారం చేసిన ఓ వ్యక్తికి చిత్తూరు జిల్లా న్యాయస్థానం 20 ఏళ్ల జైలు, జరిమానా విధిస్తూ తీర్పునిచ్చింది.గుడుపల్లె మండలానికి చెందిన దేవరాజులు (32) తొమ్మిదో తరగతి చదువుకుంటున్న ఓ బాలికకు మాయమాటలు చెప్పి అత్యాచారానికి పాల్పడ్డాడు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, నిందితుడిని రిమాండుకు తరలించారు.ఈ కేసు శుక్రవారం పోక్సో కోర్టులో విచారణ జరిగింది.పూర్వాపరాలు పరిశీలించిన అనంతరం దేవరాజులుపై నేరం రుజువు కావడంతో 20ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ. 2 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి శాంతి తీర్పుచెప్పారు.అలాగే, బాలికకు నష్టపరిహారం కింద రూ.3 లక్షలు ప్రభుత్వం ద్వారా మంజూరు చేయించాలని కలెక్టర్‌కు ఆదేశాలు జారీచేశారు.

డీవీ సత్రం డిపోలో
ఇసుక భద్రమేనా ...?
అర్ధరాత్రి వేళ తరలించేందుకు ప్రయత్నాలు

దొరవారిసత్రం, జూన్ 28 : గత ప్రభుత్వ హయాంలో వైసీపీ నాయకులు చాలామంది ఇసుక వ్యాపారంలో రూ.కోట్లు గడించారు.నదులను తోడి తీసుకొచ్చిన ఇసుకను ప్రభుత్వం డిపోలు ఏర్పాటు చేసి విక్రయించింది. ఆ క్రమంలోనే సూళ్లూరుపేట నియోజకవర్గంలోని అన్నీ ప్రాంతాలకు ఇసుక సరఫరా చేసేందుకు దొరవారిసత్రం మండలంలోని నేతాజీనగర్ వద్ద జాతీయ రహదారి పక్కనే ఇసుక డిపో ఏర్పాటు చేసింది. ఆ డిపో నుంచీ కోట్లాది రూపాయల వ్యాపారం జరిగింది. వాకాడు ప్రాంతాల నుంచి స్వర్ణముఖి ఇసుకను తీసుకు వచ్చి ఇక్కడ డిపోలో నిల్వ చేసి విక్రయాలు చేపట్టారు.ఈ డిపోలో భారీగా ఇసుక నిల్వలున్నాయి. గత ప్రభుత్వంలో విక్రయాలు జరిపిన గుత్తేదారు ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చాక భారీగా డిపోలో ఇసుక నిల్వ చేశారు. ఎన్నికల అనంతరం ప్రభుత్వం మారడంతో ఆ ఇసుకను రాత్రి వేళల్లో తరలించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని సమాచారం. ఇటీవల ఈ డిపోను పరిశీలించిన జిల్లా మైనింగ్ శాఖ అధికారులు ఆ ఇసుక నిల్వలను సీజ్ చేస్తున్నట్లు ప్రకటించారు. డిపో వద్ద పోలీస్ పికెట్ ఏర్పాటు చేయించారు. అయితే ఈ కాస్త భద్రతతో ఇసుక నిల్వలను కాపాడడం కష్టమే.అధికార యంత్రాంగం మేలుకోకపోతే ఈ డిపోలోని ఇసుక తమిళనాడు, బెంగుళూరుకు తరలిపోయే అవకాశముంది.



డిపోలోని ఇసుక



లయన్స్ క్లబ్ తిరుపతి అధ్యక్షుడిగా
ముబారక్ బాషా

తిరుపతి రూరల్, జూన్ 28: తిరుపతి లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు అధ్యక్షుడు భీమినేని మునికృష్ణనాయుడు తెలిపారు. స్థానిక భీమాస్ డీలక్స్ హోటల్‌లో నిర్వహించిన సమావేశంలో 2024-25 సంవత్సరానికి కొత్త అధ్యక్షుడిగా ఎస్‌కే ముబాకర్‌బాషా, కార్యదర్శిగా టి.గోకుల్‌కృష్ణ, కోశాధికారిగా మేరీ, ఉపాధ్యక్షులుగా లెక్కల నాగరాజనాయుడు, మిట్టా ప్రదీప్‌కుమార్, వినోద్ వెంకటాచలం, సభ్యుల కమిటీ చైర్మన్‌గా మోహన్ సుందరం, ఎల్‌సీఐఎఫ్ కోఆర్డినేటర్‌గా రాజేంద్రప్రసాద్, సర్వీస్ చైర్మన్‌గా కేఎస్ ప్రసాద్, మార్కెటింగ్ చైర్మన్‌గా జి.సురేష్, అడ్మినిస్ట్రేటర్‌గా చిత్రా మోహన్, డైరెక్టర్లుగా మబ్బు సూర్యనారాయణరెడ్డి, ఎంఆర్ చంద్రన్, నిర్మల శేఖర్‌బాబు, సులోచన, అన్నం సురేష్‌బాబు, అన్నపూర్ణ, కస్పా పద్మనాభం, సాకం కృష్ణమూర్తిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నామని ప్రకటించారు. కాగా క్లబ్ మాజీ గవర్నర్ వి.విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో వచ్చేనెల7న నూతన కార్యవర్గ ప్రతినిధుల ప్రమాణ స్వీకారం ఉంటుందని పేర్కొన్నారు.

పలు ప్యాసింజర్ రైళ్ల రద్దు

తిరుపతి(సెంట్రల్), జూన్ 28: తిరుపతి- కాట్పాడి రైల్వేస్టేషన్ల మధ్య రాకపోకలు నిర్వహించే ప్యాసింజర్ రైళ్లు జూలై 31వ తేదీవరకు రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో సీహెచ్ రాకేష్ తెలిపారు. తిరుపతి రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయడానికి తిరుపతి నుంచి కాట్పాడి వరకు రాకపోకలు నిర్వహించే ప్యాసింజర్ రైళ్ల(07659-07582)ను రద్దు చేశామన్నారు. అలాగే తిరుపతి- విల్లుపురం మధ్య నడిచే రైళ్ల (16853-16854)ను కూడా జూలై 31వ తేదీ వరకు రద్దు చేశామని పేర్కొన్నారు.

నిమ్మధరలు తగ్గుముఖం



గూడూరు అర్బన్, జూన్ 28: ఇటీవల నిలకడగా కొనసాగిన నిమ్మకాయల ధరలు శుక్రవారం తగ్గుముఖం పట్టాయి. గూడూరు మార్కెట్‌లో శుక్రవారం గరిష్ఠంగా కేజీ రూ. 60 నుంచి కనిష్ఠంగా రూ. 20వరకూ అమ్ముడయ్యాయి. సుమారు 3 నెలలుగా కేజీ రూ. 80కి తగ్గకుండా ధర పలికిన నిమ్మకాయలు శుక్రవారం నిరాశపరిచాయి. దేశవ్యాప్తంగా వర్షాలు కురుస్తుండడం, వేసవితాపం తగ్గిపోవడంతో నిమ్మ ధరలకు తిరోగమనం ప్రారంభమైనట్లు వ్యాపారులు చెబుతున్నారు. లైవాన్ రకం నిమ్మకాయలను వ్యాపారులు అసలు విక్రయానికి తీసుకోలేదని రైతులు వాపోయారు. పండ్లు, పొడికాయలకు 50 కేజీల టిక్కీ బస్తా రూ. 200కు మించి ధర లభించలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు.

చీటింగ్ కేసులో దంపతులకు మూడేళ్ల జైలు

తిరుపతి(లీగల్), జూన్ 28: చెక్ చీటింగ్ కేసులో తిరుపతికి చెందిన దంపతులు కె.శ్రీనివాసులు, కె.ఓంకారలక్ష్మిలకు మూడేళ్ల జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ.5వేల చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి మూడో అదనపు మున్సిఫ్‌కోర్టు న్యాయమూర్తి ఎం.సంధ్యారాణి శుక్రవారం తీర్పు చెప్పారు. ఫిర్యాదు తరపు న్యాయవాది జి.వెంకటకుమార్ తెలిపిన వివరాల మేరకు.. 2011 ఆగస్టు 14వ తేదీన తిరుపతి బైరాగిపట్టెడకు చెందిన పి.పురుషోత్తం వద్ద కె.శ్రీనివాసులు, ఓంకారలక్ష్మి దంపతులు రూ.4లక్షలు అప్పుగా తీసుకున్నారు. అప్పు చెల్లించే క్రమంలో భార్యపేరుతో ఉన్న చెక్‌పై భర్తసంతకం చేసి పురుషోత్తంకు ఇచ్చారు. సదరు చెక్‌ను బ్యాంకులో డిపాజిట్ చేయగా సంతకం తేడా రావడంతో రిటర్న్ అయింది. ఉద్దేశపూర్వకంగా మోసం చేసినట్లు నేరం నిరూపణ కావడంతో న్యాయమూర్తి పైవిధంగా శిక్ష విధించారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

జామియా మసీదు కమిటీ నియామకం



నూతన అధ్యక్షుడిని అభినందిస్తున్న పాశిం సునీల్‌కుమార్

కోట, జూన్ 28 : కోటలోని బజారుసెంటర్‌లో ఉన్న జామియా మసీదు నూతన కమిటీని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్‌బోర్డు నియమిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు టీడీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ జలీల్ అహ్మద్ శుక్రవారం అధికారికంగా ప్రకటించారు. ఈ మేరకు నూతన పాలకమండలిని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ శాలువాలతో అభినందించారు. జామియా మసీదు ముత్తవల్లి ధర్మకర్తగా షేక్‌అలీ అహ్మద్, సెక్రటరీగా జహీర్‌బాషా, కోశాధికారిగా మాబాషా బాధ్యతలు చేపట్టారు. సభ్యులుగా కరీముల్లా, జాహీద్‌నవాజ్, ఖాదర్‌మోహి ద్దీన్, నౌషాద్, సునీల్‌బాషా, అహ్మద్‌బాషా, అబ్దుల్, వహిద్ నియమితులయ్యారు.

సామూహిక పుట్టినరోజు వేడుకలు



గూడూరు, జూన్ 28: స్థానిక గాంధీనగర్ సమీపంలోని మినీ గురుకుల పాఠశాలలో శుక్రవారం శ్రీకృష్ణసేవా సమితి అధ్యక్షుడు మయూరి శ్యామ్‌యాదవ్ దాతృత్వంతో విద్యార్థినులకు సామూహిక పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్యామ్‌యాదవ్ మాట్లాడుతూ ప్రతినెలా ఆ నెలలో పుట్టినరోజు జరుపుకోనున్న విద్యార్థినులకు సామూహిక పుట్టినరోజు వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మేరీ తదితరులు పాల్గొన్నారు.

ప్రోత్సాహక బహుమతుల అందజేత



గూడూరు, జూన్28: స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం పదో తరగతిలో ప్రతిభచాటిన విద్యార్థులకు 1985-86 బ్యాచ్ టెన్త్ విద్యార్థుల ఆధ్వర్యంలో ప్రోత్సాహక నగదు బహుమతులను అందజేశారు. పదో తరగతిలో మంచి మార్కులు సాధించిన హర్షవర్ధన్, గెర్షోమ్, యావేష్ అనే విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు భారతి, శివకుమార్, వరప్రసాద్, దామోదర్, కొండా శ్రీనివాసులు, గిరి, రాజేష్, డేగా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలికి సన్మానం



సూళ్లూరుపేట, జూన్ 28: సూళ్లూరుపేట ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయురాలిగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేస్తున్న అరవపాణి ప్రమీలను శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఎంఈవో శ్రీనివాసుల రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి ఉపాధ్యాయులుగా ఉంటూ ప్రమీల సేవలను కొనియాడారు. అనంతరం ఉపాధ్యాయులు, సిబ్బంది ఆమెను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-2 శీనయ్య, ప్రధానోపాధ్యాయుడు గజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

బాధిత రైతులకు నష్టపరిహారం ఇప్పించండి



ఆందోళన చేస్తున్న రైతులు

పెళ్లకూరు, జూన్ 28: జాతీయ రహదారి విస్తరణలో భూములు కోల్పోయిన రైతులకు నష్ట పరిహారం చెల్లించాలంటూ శుక్రవారం బాధిత రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. మండలంలోని పెన్నేపల్లి గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబరు 10లో 10 మంది రైతులకుపైగా 20 అంకణాల నుంచి 30 అంకణాల వరకు భూములు కోల్పోయారు. అయితే భూములు కోల్పోయిన రైతులు ప్రతాప్‌రెడ్డి, జయరామయ్య, సుధాకర్‌రెడ్డి, వెంకటరత్నం, సుబ్రహ్మణ్యం తదితర రైతుల ఖాతాలలో నగదు జమచేయలేదు. రోడ్డు విస్తరణ పనులు మాత్రం బాధిత రైతుల భూముల్లో చేపడుతున్నారు. నగదు అందజేసి రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

చేయూత ఆశ్రమానికి నిత్యావసరాల అందజేత



భోజనం చేస్తున్న ఆశ్రమ విద్యార్థులు

నాయుడుపేట,జూన్ 28: నాయుడుపేట ఎల్‌ఏ సాగరంలోని చేయూత అనాథ ఆశ్రమానికి ప్రముఖ వ్యాపారవేత్త బయ్యా రమేష్ బియ్యం, నిత్యావసర సరుకులు, కాస్మోటిక్స్ అందజేశారు. రమేష్ భార్య సుజాత జన్మదినం సందర్భంగా శుక్రవారం విద్యార్థులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనాలను ఏర్పాటు చేశారు. ఆశ్రమంలోని విద్యార్థులను బాధ్యతగా, అభిమానంగా చూసుకుంటున్న ఆశ్రమ నిర్వాహకుడు తొప్పాని కృష్ణను ప్రత్యేకంగా అభినందించారు.

చంద్రబాబుతో మాధవ నాయుడి బేటీ



దక్కిలి, జూన్ 28 : విజయవాడలో శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబును అండమాన్ నికోబార్ దీవుల టీడీపీ ఇన్‌చార్జి, టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు వెంపటి మాదవ నాయుడు కలిశారు. నాలుగోసారి ముఖ్యమంత్రి అయిన సందర్భంగా ఆయన్ను కలిసి శుభాకాంక్షలు తెలియచేశారు. చంద్రబాబుకు చిన్ననాటి స్నేహితుడైన మాధవనాయుడు యోగక్షేమాలు, అండమాన్ నికోబార్ దీవుల్లో పార్టీ స్థితిగతులను చంద్రబాబు తెలుసుకొన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో అండమాన్ ఎంపీ స్థానం టీడీపీ మద్దతుతో గెలుసుకోవడం జరిగిందన్నారు. అనంతరం వారిద్దరు బాల్యజ్ఞాపకాలను నెమరు వేసుకొన్నారు.

హోటళ్లను తనిఖీ చేసిన ఫుడ్ ఇన్‌స్పెక్టర్



సూళ్లూరుపేట, జూన్ 28: సూళ్లూరుపేటలోని పలు హోటళ్లను జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఎన్.మద్దిలేటి ఆకస్మికంగా తనిఖీ చేశారు హోటళ్లు నిర్వహించే వ్యాపారస్తులు ఆహార నియమ నిబంధనలు తప్పకుండా పాటించాలన్నారు. నిల్వ ఆహార పదార్థాలు వినియోగించి ప్రజల ప్రాణాలకు హాని కలిగిస్తే చర్యలు తప్పవన్నారు. ఈ సందర్భంగా పలుచోట్ల శాంపిల్స్ సేకరించి పరీక్షల నిమిత్తం పంపనున్నట్లు పేర్కొన్నారు.

డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభం

గూడూరు అర్బన్, జూన్28: స్థానిక ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో చేరేందుకు ఆసక్తి కలిగిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చునని ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని రకాల రాయితీలతోపాటు వసతి గృహ సౌకర్యం, క్రీడా మైదానం ఉన్నాయన్నారు. మరిన్ని వివరాలకు 9866008662, 9553558613 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

కోట, జూన్ 28 : చిట్టేడు ప్రభుత్వ బాలికల ఐటీఐ రెండో విడత అడ్మిషన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ అద్దంకి రాజేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రీషియన్ 9 సీట్లు, ఫిట్టర్ 10 సీట్లు, ఎలక్ట్రానిక్ మెకానిక్ 14 సీట్లు, మెకానికల్ డీజల్ 42 సీట్లు, వెల్డర్ 40 సీట్లు వంతున ఖాళీలు ఉన్నాయన్నారు. జూలై 24వ తేదీ వరకు దరఖాస్తులు ఆన్‌లైన్ ద్వారా పంపాలన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నవారు సమీప ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఒరిజనల్ సర్టిఫికెట్లతో ఆయా తేదీలలో వెరిఫికేషన్ చేయించుకోవచ్చన్నారు. వివరాలకు 8008583423, 8498066674 నెంబర్లలో సంప్రదించాలని ప్రిన్సిపాల్ కోరారు.

దర్గా వద్ద అన్నదానం



నాయుడుపేట టౌన్, జూన్ 28 : పట్టణంలోని చిన్నదర్గావీధిలో ఉన్న హజరత్ ఖాదర్‌వల్లి దర్గావద్ద గంధ మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. చివరిరోజున శుక్రవారం చిన్న దర్గావద్ద మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం దర్గావద్ద చదివింపులు చేసి ఆశీర్వాదం పొందారు. దర్గా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గురుకులాల్లో వసతులు కల్పించండి



నాయుడుపేట టౌన్, జూన్ 28 : గురుకుల పాఠశాలలో విద్యార్థులకు మౌలిక వసతులను కల్పించాలని ఏబీవీపీ నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం నాయుడుపేట గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌ను వారు కలసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు చందు, వినయ్, అఖిల్, అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ అధ్యక్షుడిని కలిసిన శీలం



గూడూరు అర్బన్, జూన్ 28: మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును ఆ పార్టీ రాష్ట్ర నిర్వహక కార్యదర్శి శీలం కిరణ్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం ఎన్ని ఇబ్బందులు పెట్టినా, ప్రలోభాలకు గురిచేసినా తాను నమ్ముకున్న సిద్ధాంతాలను వదిలిపెట్టకుండా విశాఖలో టీడీపీని విజయ లక్ష్యాలకు చేర్చడమే లక్ష్యంతో పోరాడిన పల్లా శ్రీనివాసరావుకు సముచిత స్థానం దక్కిందన్నారు.

లాసెట్ ర్యాంకర్లకు పుస్తకాల అందజేత



వెంకటగిరిటౌన్, జూన్ 28: పట్టణంలోని బొప్పాపురానికి చెందిన జింక వర్షిణి లా సెట్‌లో 45 ర్యాంక్ సాధించడంతో ఆమె స్వామి వివేకానంద యువసైన్యం నిర్వహకులు, ఏపీపీ ప్రకృతి కుమార్ శుక్రవారం అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వెంకటగిరి నుంచి 15మంది విద్యార్థులు లాసెట్‌లో ర్యాంక్‌లు సాధించడం గర్వకారణంగా ఉందన్నారు. అనంతరం విద్యార్థులు లా పుస్తకాలు బహుకరించి, సన్మానం చేశారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

వెంకటగిరిటౌన్, జూన్ 28: కోర్టు ఆవరణలో శనివారం జాతీయ లోక్ అదాలత్ జరగనుందని బీఎస్ఎన్ఎల్ డీఈ అంకయ్య, ఏవో నాగేశ్వరరావు, జేఈవో కామేశ్వరరావు శుక్రవారం తెలిపారు. పెండింగ్ బిల్లుల వినియోగదారులు తమ సమస్యను రాజీ చేసుకోవాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పేదలకు దుస్తుల పంపిణీ



గూడూరు, జూన్ 28: స్థానిక సరస్వతి శిశుమందిరంలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం పేద గిరిజన మహిళలకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ చైర్మన్ రియాజ్‌అహ్మద్ మాట్లాడుతూ పేదలకు దుస్తులు పంపిణీ చేయడంతోపాటు ఓ మహిళకు కుట్టుమిషన్‌ను పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో రవిచంద్ర, శివయ్య, రాము, సోమిశెట్టి చెంచురామయ్య, ఎంవీరమణయ్య, మురళీరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, ప్రసాద్, రూపేష్‌రెడ్డి, కళ్యాణ్‌సాయి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళులాంటివి

ఎమ్మెల్యే రామకృష్ణ



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

దక్కిలి, జూన్ 28 : అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళులాంటివని, వాటిని బ్యాలెన్సు చేస్తేనే ప్రజలకు మేలు జరుగుతుందని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. డక్కిలి మండలం పాతనాలపాడు దళితవాడలో శుక్రవారం రాత్రి ఆయన మాతమ్మ కొలుపు కార్యక్రమానికి హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ గత ఐదేళ్ళ వైసీపీ ప్రభుత్వం అభివృద్ధి అంటే ఏమిటో తెలియకుండా పాలన సాగించిందన్నారు. ఫలితంగా రాష్ట్రం అప్పులు పాలైందని విమర్శించారు. గత పాలకుల అనాలోచిత చర్యలు వల్ల నియోజకవర్గంలో రోడ్లు దారుణంగా దెబ్బతిన్నా పట్టించుకోలేదన్నారు. ఇప్పుడు మనం వాటన్నిటిని బాగుచేసుకోవాలన్నారు. రోడ్ల మరమ్మతులకు తొలి ప్రాధాన్యత ఇస్తామన్నారు. వెంకటగిరిలో చిన్నతరహా పరిశ్రమలు నెలకొల్పేలా తాను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఇక నియోజకవర్గంలో సాగు, తాగునీటి అవసరాలపై దృష్టి పెడతామన్నారు. నియోజకవర్గంలో గడిచిన ఐదేళ్ళ వైసీపీ పాలనలో అడ్డగోలు నిర్మాణాలు జరిగాయని, వాటి విషయంలో చట్టం తనపని తాను చేసుకు పోతుందన్నారు. అక్రమ లేఅవుట్లు, భూ కబ్జాలపై అధికారులు కొరడా ఝులిపించాలని సూచించినట్లు తెలిపారు. అంతకు ముందు ఆయన పాతనాలపాడు గ్రామంలో నిర్మాణంలో వున్న పోలేరమ్మ గుడి పనులను పరిశీలించారు. గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న టీడీపీ సీనియర్ నాయకుడు రోశయ్య నాయుడిని పరామర్శించారు. ఆయన వెంట మండల పార్టీ అధ్యక్షుడు పోలంరెడ్డి వెంకటేశ్వర్లు రెడ్డి, మాజీ జడ్పీటీసీ ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు, నాయకులు దందవోలు రత్నాహకరరెడ్డి, కాపా శ్రీనివాసులు నాయుడు, పిపి చౌదిరి ఎస్‌ఐ చౌడయ్య తదితరులు వున్నారు.

నేటి నుంచి కోటమ్మ ఉత్సవాలు



విద్యుత్ దీపాలంకరణలో కోటమ్మ ఆలయం

కోట, జూన్ 28 : కోట గ్రామదేవత కోటమ్మ ఉత్సవాలు శని వారం నుంచి రెండు రోజులపాటు జరగనున్నాయి. శుక్రవారం రాత్రి కోటమ్మ మూలవిరాట్‌కు మల్లెపూలతో అలంకరణ చేశారు. భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. 29, 30వ తేదీలలో కోటమ్మ ఉత్సవాలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. ఈ ఉత్సవాలకు పలువురురాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు హాజరుకానున్నారు.



మల్లెపూల అలంకారంలో కోటమ్మ

అందరి సహకారంతో అభివృద్ధి పనులు

ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ



అధికారుల పరిచయ కార్యక్రమంలో ఎమ్మెల్యే విజయశ్రీ తదితరులు

సూళ్లూరుపేట, జూన్ 28: అందరి సహకారంతో సూళ్లూరుపేట నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. శుక్రవారం స్థానిక సత్యసాయి కల్యాణ మండపంలో అధికారులతో పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఆర్డీవో చంద్రముని ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి అధికారులు విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె అందరిని పరిచయం చేసుకొని శాఖల వారీగా అధికారులతో గ్రామాల్లో సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులను అడిగి తెలుసుకొని అందరూ సహకారంతో ప్రజల సమస్యలు పరిష్కరించి గ్రామాలను అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రమణ్యం, తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ, మున్సిపాలిటీ కమిషనర్ గంగాప్రసాద్ ఆరు మండలాలకు చెందిన అధికారులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు. సూళ్లూరుపేట నియోజకవర్గంలో తొలి మహిళా ఎమ్మెల్యేగా విజయం సాధించిన నెలవల విజయశ్రీకి అభినందనలు తెలిపేందుకు ఆమె నివాసానికి మహిళలతో పాటు పార్టీ నాయకులు క్యూ కడుతున్నారు. ఎమ్మెల్యేను శుక్రవారం టీడీపీ మహిళా నాయకురాలు బుద్ధి విజయలక్ష్మి, రమణమ్మ, భారతితోపాటు పట్టణ అధ్యక్షు, కార్యదర్శులు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్ పలువురు కలిసి సన్మానించారు.

ఐమాప్ సాయంతో అదనపు తరగతి గదుల నిర్మాణం



సూళ్లూరుపేటలో వేగంగా తరగతి గదుల నిర్మాణ పనులు

సూళ్లూరుపేట, జూన్ 28: శ్రీసిటీలోని ఇండియా మెటల్ వన్ స్టీల్ ప్లేట్ ప్రాసెసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ (ఐమాప్) పరిశ్రమ సాయంతో సూళ్లూరుపేట పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో అదనపు తరగతి గదులకు శ్రీకారం చుట్టారు. పాఠశాల ఆవరణలో రెండు గదుల భవనాన్ని కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా ఐమాప్ పరిశ్రమ వారు రూ.25 లక్షలతో వ్యయంతో నిర్మించేందుకు శ్రీకారం చుట్టారు. అదనపు తరగతి గదుల నిర్మాణ పనేలు శరవేగంగా జరుగుతున్నాయి. గదుల నిర్మాణం పూర్తయినంతరం పర్నీచర్స్, పరికరాలను కూడా సమకూర్చనున్నారు. శ్రీసిటీ పరిసర ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలలు, ఇతర విద్యా సంస్థల్లో మౌలిక వసతులు మెరుగుపర్చడానికి మరిన్ని కార్యక్రమాలు ఐమాప్ పరిశ్రమ వారు చేపడుతున్నారు. గదుల నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేసి ఆగస్టు 15న అందుబాటులోకి తెచ్చేందుకు నిర్మాణ పనులు వేగంగా చేస్తున్నారు.

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకే 'తల్లికి వందనం' ఇవ్వాలి

- ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలసుబ్రహ్మణ్యం



క్యాంపెన్ చేస్తున్న బాలసుబ్రహ్మణ్యం తదితరులు

నాయుడుపేట, జూన్ 28 : రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా చేపడుతున్న తల్లికి వందనం పథకాన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకే అందజేయాలని ఏపీటీఎఫ్ తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి బాలసుబ్రహ్మణ్యం అన్నారు. ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదు క్యాంపెన్‌లో భాగంగా శుక్రవారం నాయుడుపేట ఉన్నత పాఠశాలలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే వారికి మాత్రమే ఈ పథకాన్ని అందజేయడం ద్వారా పేద విద్యార్థులకు మంచి జరుగుతుందన్నారు. జీవోనెంబరు 117ను రద్దుచేయడం ద్వారా ప్రాథమికోన్నత పాఠశాలలు తిరిగి ప్రారంభమవుతాయని తద్వారా గ్రామీణ, పేద విద్యార్థులకు సమీపంలోనే విద్యాభ్యాసాలు అందుతాయన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ మండల కమిటీ అధ్యక్షుడు సీహెచ్ అల్లెయ్య, రజనీబాబు, మస్తానయ్య, శ్రీహరిరాజు ఉన్నారు.

సీనియర్ సహాయకురాలికి సన్మానం

కోట, జూన్ 28: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సీనియర్ సహాయకులుగా పనిచేస్తూ పదవీ విరమణ పొందిన ఎన్.దేవకికి సన్మాన సభ జరిగింది. మండల పరిషత్ సిబ్బందితోపాటు ఎంపీపీ అంజమ్మ, ఎంపీడీవో శంకరయ్యలు దేవకిని షీల్డ్‌లు, మెమెంటోలతో అభినందించారు. విధుల్లో ఆమె చేసిన సేవలను కొనియాడారు.

చికిత్సపొందుతూ మహిళ మృతి

చిల్లకూరు, జూన్ 28: మండలంలోని మన్నెగుంటలో పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడి చికిత్సపొందుతున్న నాగరాజమ్మ(33) శుక్రవారం మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. బుధవారం కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురైన నాగరాజమ్మ ఆమె నివాసానికి సమీపంలోని తోటలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. అపస్మాకర స్థితిలో ఉన్న నాగరాజమ్మను స్థానికులు, కుటుంబసభ్యులు చికిత్సనిమిత్తం నెల్లూరుకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందినట్లు పోలీసులు.

ప్రమాదకరంగా కల్వర్టులు



బాలుర ఉన్నతపాఠశాల సమీపంలో రక్షణగోడ లేని కల్వర్టు

గూడూరు, జూన్ 28: పట్టణంలో పలు పంట కాలువలు, ప్రధాన కాలువలపై గతంలో నిర్మించిన కల్వర్టులకు రక్షణ గోడలను అభివృద్ధి పరచకపోవడంతో ప్రమాదకరంగా ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. పట్టణంలో పంటకాలువలు, డ్రైనేజీకాలువలపై రాకపోకలు సాగించేందుకు గతంలో కల్వర్టులను నిర్మించి రక్షణ గోడలను ఏర్పాటు చేశారు. అయితే కాలక్రమంలో రోడ్లను అభివృద్ధిపరచడంతో కల్వర్టులపై కూడా రోడ్లు ఏర్పాటు చేశారు. దీంతో రక్షణ గోడలు రోడ్డుకు సమాంతరంగా ఉన్నాయి. రక్షణ గోడల ఎత్తును పెంచకపోవడంతో అవి రోడ్డుకు సమాంతరంగా ఉండి కనిపించడం లేదు. బాలాజీనగర్‌కు వెళ్లేమార్గంలో, డీఆర్‌డబ్ల్యూ కళాశాల సమీపంలో, జడ్పీబాలుర ఉన్నతపాఠశాల సమీపంలో, పట్టణంలోని పలు ప్రాంతాల్లో కల్వర్టుల వద్ద రక్షణగోడల ఎత్తు పెంచకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు అంటున్నారు. స్థానిక రాణిపేటకు వెళ్లే మార్గంలోని నాయుడుకాలువ వద్ద కొన్నేళ్ల క్రితం రక్షణగోడ కూలిపోయి ప్రమాదకరంగా ఉంది. అధికారులు స్పందించి కల్వర్టుల వద్ద రక్షణగోడలను అభివృద్ధిపరిచి ప్రమాదాలు జరగకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

క్యాన్సర్‌పై అవగాహన

తడ, జూన్ 28 : స్థానిక ఉన్నత పాఠశాలలో శుక్రవారం మెగా క్యాన్సర్ చికిత్స శిబిరం నిర్వహించారు. సూళ్లూరుపేట లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్యాన్సర్ అండ్ అడ్వాన్స్‌డ్ రీసెర్చ్ సెంటర్ సహకారంతో జరిగిన ఈ శిబిరంలో క్యాన్సర్‌పై అవగాహన కల్పించడంతోపాటు ఉచితంగా పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు వెంకయ్యబాబు,లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు ఆదిశేషారెడ్డి, కార్యదర్శి శ్రీనివాసశెట్టి, క్యాంప్ చైర్మన్ అరుణకుమారి, సిబ్బంది రెడ్డి కుమారి, మహేంద్ర, హేమంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా గురుకులాల్లో ఖాళీల భర్తీ

డక్కిలి, జూన్ 28 : డక్కిలిలోని గురుకుల పాఠశాలలో ఖాళీగా వున్న సీట్లు భర్తీ విషయంలో పాదర్శకంగా వ్యవహరించామని ప్రిన్సిపాల్ శ్రీదేవి తెలిపారు. గురువారం ఆమె మీడియాతో మాట్లాడుతూ గరుకుల ప్రవేశాల్లో విద్యార్థులకు అన్యాయం జరిగిందని ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకుడు మునెయ్య చేసిన ఆరోపణల్లో నిజం లేదన్నారు. పేదరికాన్ని, ప్రతిభను అర్హతగా తీసుకొని విద్యార్థులకు సీట్లు కేటాయించామన్నారు. 7, 8 తరగతుల్లో సీట్లు ఖాళీ లేకపోవడం వల్లే వాటికి పరీక్షలు నిర్వహించలేదన్నారు.

డ్రైనేజీ ఇలా...మురుగు పారేదెలా ?



తోలిమిట్ట దారిలో డ్రైనేజీ పూడిన కాలువ

వెంకటగిరిటౌన్, జూన్ 28: పట్టణంలోని తోలిమిట్ట ప్రాంతంలో డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా తయారైంది. దీంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షకాలంలో మురుగు పారకపోతే దోమలు స్వైరవిహారం చేస్తాయని ఆందోళన చెందుతున్నారు. అంతేకాకుండా ఇక్కడ పందుల సంచారం ఉండడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల మున్సిపల్ సిబ్బంది చెత్తను జేసీబీతో ఎత్తడంతో అక్కడ గుంత పడడంతో వర్షపు నీరు నిలిచి దుర్వాసన వస్తుందని స్థానికులు కమిషనర్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందని వాపోతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.